బ్రహ్మోత్సవాల వేళ

కొండమీద సిట్ సందడి

తిరుమల, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): ఒక వైపు తిరుమల కొండమీద బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు జరుగుతున్నాయి. టీటీడీ అధికారులూ, ఉద్యోగులూ ఆ పనుల్లో తలమునకలై ఉన్నారు. మరోవైపు ఇదే సమయంలో లడ్డూ కల్తీ వ్యవహారంపై ఏర్పాటైన సిట్ కూడా దూకుడు పెంచింది. సోమవారం తిరుమలలో బృందాలుగా విడిపోయి విచారణ సాగించింది. మూడో రోజు సోమవారం సిట్ చీఫ్ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, డీఐజీ గోపీనాథ్‌జెట్టి, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఏఎస్పీ వెంకట్రావు, సభ్యులు తిరుమలలో ఉన్న నెయ్యి, ముడిసరకుల పరీక్షాకేంద్రాన్ని తనిఖీ చేశారు. నెయ్యి ట్యాంకర్లు ఎలా వస్తాయి? నాణ్యతను ఎలా పరీక్షిస్తారు? రికార్డులు ఎలా ఉన్నాయనే అంశాల పరిశీలనతో పాటు కొన్ని రికార్డులను తీసుకున్నారు. తర్వాత నెయ్యి నిల్వ ఉంచే కేంద్రం, నెయ్యి సరఫరా అయ్యే విధానం, బూందీ తయారీ కేంద్రం, ఆలయంలోని లడ్డూ తయారీ పోటును పరిశీలించారు. తర్వాత



ల్యాబ్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న సిట్ సభ్యులు

టీటీడీ ఉన్నతాధికారులు, కొనుగోళ్ల విభాగం అధికారులతో సమీక్షించారు. పలువురు అధికారులు, ఆయా విభాగాల్లోని సిబ్బందితో మాట్లాడి వివరాలు తీసుకున్నారు. ఇందులో ప్రధానంగా.. లడ్డూలకు వినియోగించే బూందీ తయారీ కేంద్రాన్ని పరిశీలించిన సిట్ అధికారులు కొంతమంది పోటు కార్మికులతో మాట్లాడారు.

ఈసందర్భంగా గతంలో వచ్చిన నెయ్యిలో నాణ్యత లేదని అప్పటి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని సిట్ బృందానికి కొందరు పోటు కార్మికులు తెలిపినట్టు సమాచారం. నెయ్యిని చూడగానే నాణ్యత ఎలా ఉందో అర్థమైపోతుందని, కానీ గతంలో వాడిన నెయ్యిలో పూర్వపు నెయ్యి నాణ్యత కనిపించలేదని పోటు కార్మికులు సిట్ బృందం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది.

ఎన్‌డీడీబీకి మరో శాంపిల్?

తిరుమలకు ఓ సంస్థ పంపిన ట్యాంకర్‌లోని నెయ్యిని సిట్ సిబ్బంది శాంపిల్స్ తీశారు. వాటిని పరీక్షించే విధానాన్ని స్వయంగా పరిశీలించడంతో గతంలో నెయ్యిలో కల్తీ జరిగినట్టు నిర్ధారించిన ఎన్‌డీడీబీ ల్యాబ్‌కు కూడా పంపనున్నట్టు తెలిసింది. ఇప్పటికీ నెయ్యిలో కల్తీ జరుగుతోందా అనే అంశాలపై దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం.

నేడు ఏఆర్ డెయిరీకి హర్షవర్ధన్‌రాజు టీం

శ్రీవారి లడ్డూప్రసాదాలకు వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిన నెయ్యిని పంపారంటూ విమర్శలు ఎదుర్కొంటున్న తమిళనాడులోని దిండిగల్ ఏఆర్ డెయిరీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను విచారించేందుకు సిట్‌కి సంబంధించి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు బృందం వెళ్లనుంది. ఏఆర్ డెయిరీ సంస్థకు నాణ్యమైన నెయ్యి సరఫరా చేసే సామర్థ్యం ఉందా, ఈ సంస్థ కేవలం టీటీడీకి మాత్రమే సరఫరా చేస్తోందా, ఇంకా ఎక్కడికైనా సరఫరా చేస్తోందా అనే అంశాలను తెలుసుకోనున్నారు. అలాగే ఈ సంస్థ నెయ్యి తయారీకి ఎలాంటి జాగ్రత్తలు పాటిస్తోంది, గతంలో టీటీడీకి ఎన్నిసార్లు సరఫరా చేసిందనే అంశాలపై విచారించనున్నారు. ముఖ్యంగా ఆసంస్థ నుంచి నెయ్యిని తీసుకువస్తున్న వాహనాలు ఎవరివి, ఆ వాహనాల డ్రైవర్లు ఎవరు,ట్యాంకర్ల సామర్థ్యానికి తగ్గట్టుగానే నెయ్యిని తీసుకువస్తున్నారా, మార్గం మధ్యలో ట్యాంకర్లను ఎక్కడైనా నిలుపుతారా, ఒక వేళ కల్తీ జరిగితే ఎక్కడ జరిగే అవకాశముందనే వివిధ కోణాల్లో దర్యాప్తు చేయనున్నట్టు తెలిసింది. ఇక, ఇప్పటివరకు జరిగిన విచారణలో దాదాపు ఐదుగురు వ్యక్తులు సంబంధం లేకుండా సమాధానాలిస్తున్నట్టు సిట్ అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం.

గత ప్రభుత్వం 'స్పందన' పేరిట అమలు చేసిన ఫిర్యాదుల దినాన్ని.. కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదికగా పేరు మార్చింది. అయితే మారింది కార్యక్రమం పేరే తప్ప అందులో పాల్గొనే అధికారులు, ఉద్యోగుల తీరు కాదని చెబుతున్నారు బాధితులు. సోమవారం ఫిర్యాదుల దినాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ తహసీల్దారు, ఆర్డీవో కార్యాలయాలు, కలెక్టరేట్‌లో అధికారులు, ఉద్యోగుల హాజరు, సమయ పాలన వంటి అంశాలతో పాటు ప్రధానంగా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టింది. ఆ సందర్భంగా కొత్త ప్రభుత్వంలోనూ ఫిర్యాదుల దినం అమలు అధ్వానంగా ఉందని వెల్లడైంది. దీనికి కొందరు అర్జీదారుల ఆవేదనలే నిదర్శనం.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

మారింది పేరే.. తీరు కాదు!

- ఫిర్యాదులు తప్ప పరిష్కారమేదీ?
- ఏళ్ల తరబడి ఆఫీసుల చుట్టూ జనం ప్రదక్షిణలు
- 'ఫిర్యాదుల దినం' అమలు అధ్వానం



మూడేళ్లుగా కొడుకు పేరిట మారని భూమి

ఈ బడుగు రైతు పేరు కర్లపూడి రమణయ్య. కోట మండలం కర్లపూడి స్వగ్రామం. ఇతడి తండ్రి ఊసయ్య పేరిట ప్రభుత్వం గతంలో రెండున్నరెకరాల భూమి కేటాయించింది. తండ్రి మరణించడంతో రికార్డుల్లో తన పేరు నమోదు చేయించుకునేందుకు మూడేళ్లుగా ఈయన అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఈయన్ను పట్టించుకుని.. సమస్యను పరిష్కరించే తీరిక రెవెన్యూ అధికారులకు లేకపోతోంది.



సర్వే కోసం ఏడాదిన్నరగా ఎదురుచూపు



ఈ ఫొటోలోని వ్యక్తి మోపూరు గోపాల్. సొంతూరు వెంకటగిరి మండలం పాలెంకోట. తన పొలం గట్టును పొరుగు రైతు ఆక్రమించారని ఏడాదిన్నరగా రెవెన్యూ అధికారులకు గోడు వెళ్లబోసుకుంటున్నారు. తొలుత సర్వే చేసినప్పటికీ రిపోర్టు ఇవ్వలేదు, సమస్యను పరిష్కరించనూ లేదు. ఇద్దరు తహసీల్దార్లు బదిలీపై వెళ్లి.. ఇప్పుడు మూడో తహసీల్దారు రావడంతో మొరపెట్టుకునేందుకు వచ్చానని ఆవేదన వెలిబుచ్చారాయన.

ఆన్‌లైన్‌లో పేరు నమోదుకు..

ఈయన పేరు కడివేటి లింగస్వామి. చిల్లకూరు మండలం పొన్నవోలు. ఈయన పేరిట 1.45 ఎకరాలకు పట్టాదారు పాస్ పుస్తకం ఉంది. 1బి అడంగల్‌లో మాత్రం ఆయన పేరు నమోదు కాలేదు. రెండుసార్లు చలానా కట్టారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మూడున్నరేళ్లుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా తన సమస్య మాత్రం పరిష్కారం కాలేదని వాపోతున్నారాయన.



పరిహారం కోసం పుష్కర కాలంగా..

ఈమె పేరు కనుపూరు సుబ్బమ్మ. చిల్లకూరు మండలం తూర్పు కనుపూరు గ్రామం. కృష్ణపట్నం పోర్టు పరిధిలో ఓ పరిశ్రమ నిర్మాణం కోసం ప్రభుత్వం తూర్పు కనుపూరు 207-2ఏసర్వే నంబరులో ఈమెకున్న 1.36 ఎకరాలను 2012లో సేకరించింది. ఇంతవరకు పరిహారం మాత్రం ఇవ్వలేదు. కోర్టు ఆదేశాలున్నా కూడా అధికారులు పట్టించుకోవడం లేదనేది ఆమె ఆవేదన. కొత్తగా వచ్చిన సబ్ కలెక్టర్ అయినా న్యాయం చేస్తారన్న ఆశతో అర్జీతో వచ్చారామె.



తొలి ప్రజావేదికలో ఇచ్చిన అర్జీపై చర్యల్లేవ్

ఈ ఫొటోలోని వృద్ధురాలి పేరు దమయంతి. పిచ్చాటూరు మండలం అడవి కొడియంబేడు గ్రామం. తన స్థలానికి వెళ్లే దారిని కొందరు కబ్జా చేసి దారి లేకుండా అక్రమ కట్టడాలు కట్టేస్తున్నారనేది ఆమె సమస్య. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రజాసమస్యల పరిష్కార వేదిక పేరిట నిర్వహించిన తొలి ఫిర్యాదుల దినానే (జూన్ 24న) ఆమె రెవెన్యూ అధికారులకు అర్జీ ఇచ్చారు. ఇంతవరకు అతీగతీ లేకపోవడంతో మళ్లీ ఇప్పుడు వచ్చానని వాపోయారా వృద్ధురాలు.





రేణిగుంట తహసీల్దారు కార్యాలయం వద్ద పరిహారం అందని బాధితులు

రెండేళ్లుగా తేలని నష్ట పరిహారం

రేణిగుంట మండలంలో రేణిగుంట-కడప రోడ్డు విస్తరణ కోసం శ్రీనివాసపురం, ఇందిరమ్మ కాలనీ, అరుంధతి వాడ, కరకంబాడి బీసీ కాలనీ, రాజీవ్ గాంధీ కాలనీ తదితర ప్రాంతాల్లో 135 ఇళ్లను ప్రభుత్వం తొలగించింది. 2022 నుంచీ బాధితుల్లో పలువురికి నష్టపరిహారం అందలేదు. రెవెన్యూ సిబ్బంది అక్రమాలకు పాల్పడి తమ పేర్ల బదులు ఇతరుల పేర్లు నమోదు చేసి తమకు పరిహారం అందకుండా చేశారని, మార్కెట్ విలువ కంటే చాలా తక్కువ ధర నమోదు చేసి పరిహారం తక్కువ రావడానికి కారకులయ్యారని పలువురు బాధితులు రెండేళ్లుగా తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. సోమవారం కూడా వచ్చి అర్జీలు ఇచ్చారు.

మళ్లీ.. మళ్లీ రమ్మంటున్నారు



ఈ రైతు పేరు బాలకృష్ణ. రామచంద్రాపురం మండలం నెత్తకుప్పం. రెవెన్యూ సర్వే నెం.195/3లో 22సెంట్ల భూమి ఆన్‌లైన్ చేసుకోవడానికి ఏడాదిగా తిరుగుతున్నారు. ప్రతిసారి వీఆర్వో, ఆర్‌ఐ, తహసీల్దారు మళ్లీ రమ్మంటున్నారు గానీ పనిచేయడం లేదు. తన తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన భూమినే ఆన్‌లైన్ చేయడానికి ఇలా తిప్పుతున్నారు.

మొత్తం 187 ఫిర్యాదులు

- 120 రెవెన్యూ శాఖవే
- కలెక్టరేట్‌కు వెల్లువెత్తిన అర్జీదారులు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 30: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వివిధప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి తమ సమస్యల పరిష్కారానికి 187 వినతులు సమర్పించారు. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి భూ సమస్యలపై 120 ఫిర్యాదులున్నాయి. ఆయా అర్జీలను పరిశీలించి, పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచలకిషోర్, డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర, నరసింహులు అర్జీలు స్వీకరించారు.



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

గ్రీవెన్స్ రోజే అధికారులతో సమీక్షలు

అధికారులు, ఉద్యోగులు కార్యాలయాల్లో అందుబాటులో ఉండేదే సోమవారం. ఫిర్యాదుల దినం పేరిట అతి కష్టంగా ఆ రోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉంటారు. మిగిలిన రోజుల్లో వారు దొరకడం కష్టం. దొరికినా ఏదో ఒక పని ఉందంటూ ఇతర పనుల్లో బిజీగా ఉంటారు. ఇదీ సామాన్య జనంలో అధికారులు, ఉద్యోగుల పట్ల ఉన్న అభిప్రాయం. అయితే ఫిర్యాదుల దినమైన సోమవారాల్లోనూ అధికారులు కార్యాలయాల్లో ఉండకపోతే తాము ఎక్కడికి పోవాలి? ఎవరికి చెప్పుకోవాలి? అన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి బాధిత జనం నుంచి. సోమవారం తిరుపతి రెవెన్యూ డివిజన్ పరిధిలోని దాదాపు అన్ని రెవెన్యూ కార్యాలయాల్లోనూ తహసీల్దార్లు అందుబాటులో లేరు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఆర్డీవో కార్యాలయంలో జరిగే సమీక్షకు హాజరయ్యేందుకు వెళ్లారని సిబ్బంది చెప్పారు. ఇప్పుడు ఓటర్ల జాబితా అత్యవసరమేమీ కాదు. తప్పనిసరి అనుకుంటే సోమవారమే మధ్యాహ్నం తర్వాత సమీక్ష పెట్టుకోవచ్చు. లేదంటే మంగళవారం నిర్వహించుకోవచ్చు. అధికారులు అందుబాటులో లేకుండా ఫిర్యాదుల దినం నిర్వహించి ఉపయోగమేమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు.

ప్రాయశ్చిత్త దీక్ష విరమణకు

నేడు పవన్ రాక

- తిరుమలలో మూడు రోజులు
- 3న తిరుపతిలో వారాహి సభ



తిరుపతి, ఆంధ్రజ్యోతి/తిరుపతి అర్బన్/తిరుపతి (కలెక్టరేట్): తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై 11 రోజుల పాటు ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. దీక్ష విరమణకుగాను మూడు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం తిరుపతికి రానున్నారు. సాయంత్రం 4గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి.. అక్కడ్నుంచి రోడ్డు మార్గాన అలిపిరి పాదాల మండపం వద్దకు చేరుకుంటారు. ప్రత్యేక పూజలు చేసి నడక మార్గం గుండా తిరుమల వెళ్లి రాత్రి బస చేస్తారు. బుధవారం ఉదయం 10 గంటలకు శ్రీవారిని దర్శించుకుంటారు. అనంతరం తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రాన్ని పరిశీలించి గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. తిరిగి గురువారం సాయంత్రం తిరుపతిలో జరగనున్న వారాహి సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడతారు. అనంతరం రాత్రి 8.30గంటలకు విమానాశ్రయానికి చేరుకుని విజయవాడకు తిరుగుపయనం అవుతారని కలెక్టర్ వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీక్ష విరమించేందుకు వస్తున్న పవన్ మూడు రోజుల పాటు తిరుమలలోనే ఉండనున్నారు. లడ్డూ వివాదం నేపథ్యంలో పవన్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.

పూలే కూడలిలో వారాహి సభ!

పవన్‌కల్యాణ్ వారాహి సభ నిర్వహణ కోసం జ్యోతిరావు పూలే విగ్రహ కూడలిని ఖరారు చేసినట్లు తెలిసింది. తొలుత దీంతో పాటు లీలామహల్, అన్నమయ్య కూడళ్లను ఎంపిక చేశారు. సోమవారం ఈ మూడింటిని పరిశీలించిన జనసేన నేతలు,పోలీసులు ట్రాఫిక్ సమస్య, ప్రయాణికుల ఇబ్బందులు ఉండని, ఎక్కువ మంది గుమికూడేందుకు అవకాశం ఉన్న పూలే విగ్రహ కూడలిని ఎంపిక చేసినట్లు సమాచారం. వారాహిసభ గురువారం సాయంత్రం 5నుంచి 7.30 గంటల వరకు కొనసాగనుంది. సభాస్థలిని పరిశీలించినవారిలో రాష్ట్ర ప్రోగ్రామింగ్ కమిటీ ఛైర్మన్ కేకే శ్రీనివాస్, జనసేన తిరుపతి ఇంచార్జి కిరణ్ రాయల్, నగర అధ్యక్షుడు రాజారెడ్డి, ఆరణి శివ, పవన్, బాలాజీ తదితరులతో పాటు వెస్ట్ సీఐ రామకృష్ణ ఉన్నారు.



వారాహిసభ స్థలాన్ని పరిశీలిస్తున్న జనసేన నాయకులు, పోలీసులు

అదుపు తప్పి.. అడవిలోకి దూసుకెళ్లి

- తిరుమల మొదటి ఘాట్ వద్ద చెట్టును ఢీకొన్న కారు
- ముగ్గురు తమిళనాడువాసులకు తీవ్రగాయాలు



తిరుమల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో సోమవారం ఓ కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈప్రమాదంలో తమిళనాడుకు చెందిన ముగ్గురు భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. తమిళనాడులోని కృష్ణగిరికి చెందిన ఐదుగురితో కూడిన భక్తబృందం శ్రీవారిని దర్శించుకుని సోమవారం మధ్యాహ్నం తమ కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ఘాట్‌రోడ్డులోని చివరి మలుపువద్ద కారు అదుపుతప్పింది. రోడ్డు దాటి అడవిలోకి దూసుకుపోయి ఓ చెట్టును ఢీకొని ఆగిపోయింది. దీంతో కారులోని కల్యాణ్‌సుందరం, మంజుల, ప్రియ తీవ్రంగా గాయపడ్డారు. మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను తిరుపతిలోని రుయాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర మహిళా దొంగల అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 30: తిరుపతి రూరల్‌లో ఇటీవల మూడు ఇళ్లలో ఒకే రోజు దొంగతనాలు జరిగిన కేసుల్లో ఎంఆర్‌పల్లె పోలీసులు సోమవారం ఇద్దరు అంతర్రాష్ట్ర మహిళా దొంగలను అరెస్టు చేశారు. చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ తెలిపిన ప్రకారం.. హైదరాబాదు ఎల్‌బీనగర్‌కు చెందిన శెట్టిలక్ష్మి, శెట్టిమీనా కొంత కాలంగా తమిళనాడు, కర్ణాటక, ఏపీలోని పలు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో సెప్టెంబరు 20న రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని మూడు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడ్డారు. గతంలో రావులపాలెం వద్ద జరిగిన దొంగతనం కేసులో జైలుకు వెళ్లిన వీరి భర్తలు విజయ్, మణి బయటకు రాగా.. వారితో కలిసి విలువైన ఆభరణాలు అపహరించుకెళ్లారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న సీఐ చిన్నగోవిందు, అతడి బృందం సోమవారం రామానుజపల్లి చెక్‌పోస్టు వద్ద నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 86,960 గ్రాముల బంగారు నగలు, రూ.6.37 లక్షల విలువ చేసే 340 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో రూ.29,000 నగదు సీజ్ చేశారు. అంతర్రాష్ట్ర ముఠాను అరెస్టు చేయడంలో విశేష ప్రతిభ కనపరచిన సీఐ, ఎస్‌ఐ, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



మోమిడి పంచాయతీ కార్యాలయం

'మోమిడి'కి జాతీయ ఉత్తమ అవార్డు

- పచ్చదనం- పరిశుభ్రత విభాగంలో ఎంపిక

చిల్లకూరు, సెప్టెంబరు 30: చిల్లకూరు మండలం మోమిడి పంచాయతీకి జాతీయ స్థాయి ఉత్తమ అవార్డు లభించింది. స్వచ్ఛ భారత్‌లో భాగంగా 'పేదరికం లేని జీవనోపాధి మెరుగ్గా ఉన్న పంచాయతీ, ఆరోగ్యకరమైన, చైల్డ్ ఫ్రెండ్లీ, తగినంత నీటి వసతి, పరిశుభ్రత- పచ్చదనం, స్వయం సమృద్ధి- మౌలిక సదుపాయాలు, సామాజిక న్యాయం- సురక్షితమైన, సుపరిపాలన, ఉమెన్ ఫ్రెండ్లీ' వంటి 9 అంశాలపై కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీల్లో సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో మోమిడి పంచాయతీకి పరిశుభ్రత- పచ్చదనం విభాగంలో జాతీయస్థాయి అవార్డు వచ్చింది. ఇక్కడి సర్పంచి, పంచాయతీ కార్యదర్శి మహిళలే అయినా, పరిశుభ్రత మెరుగుకు, పచ్చదనం పెంపునకు ప్రత్యేక దృష్టి సారించారు. వీటిపై గ్రామస్తులకు అవగాహన కల్పించి, వారి సహకారంతో పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దడంతో ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుకు ఎంపికైంది.

గ్రామస్థుల సహకారంతోనే..



గ్రామస్థులు, అధికారుల సహకారంతోనే గ్రామాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్నా. పరిశుభ్రత- పచ్చదనం విభాగంలో పంచాయతీకి జాతీయస్థాయి అవార్డు రావడం సంతోషంగా ఉంది. పంచాయతీ మరింత అభివృద్ధిపరిచేందుకు కృషిచేస్తాం.

- ఈదూరు లావణ్య, సర్పంచి

రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తాం



జాతీయస్థాయి ఉత్తమ అవార్డు వచ్చిన స్ఫూర్తితో.. పంచాయతీ అభివృద్ధికి రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తాం. ఈ అవార్డు రావడానికి సహకారం అందించిన సర్పంచుకు, గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలుపుతున్నా.

- రమాదేవి, పంచాయతీ కార్యదర్శి

డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ పరీక్షల నోటిఫికేషన్ విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 30: ఎస్వీయూ పరిధిలో డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ పరీక్షల నోటిఫికేషన్ విడుదలైంది. అక్టోబరు 21వ తేదీ పరీక్షల ఫీజు చెల్లించేందుకు తుది గడువు. జరిమానాతో 31వ తేదీ దాకా అవకాశం ఉంది. నవంబరులో పరీక్షలు నిర్వహించనున్నట్లు సీఈ దామ్లా నాయక్ తెలిపారు. ఈ మేరకు యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కాలేజీలకు ఉత్తర్వులు జారీ చేశామన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.02 కోట్లు

తిరుమల, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.02 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 84,066 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 29,044 మంది తలనీలాలు సమర్పించారు.

శ్రీవారిసేవలో బాలల హక్కుల కమిషన్ చైర్మన్



ఆలయం ముందు కేసలి అప్పారావు

తిరుమల, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూ ప్రసాదాలు అందజేశారు. ఆయనతో పాటు కమిషన్ సభ్యులు త్రిపర్ణ ఆదిలక్ష్మీ, పద్మావతి కూడా ద్రర్శించుకున్నారు.

12వ పీఆర్సీ నియమించి ఐఆర్ ప్రకటించాలి

పాకాల, సెప్టెంబరు 30: రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిటీని నియమించి ఐఆర్ ప్రకటించాలని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం పాకాల యూనిట్ అధ్యక్షుడు పీఆర్ మునస్వామి కోరారు. స్థానిక పెన్షనర్ల భవనంలో సోమవారం ఆయన అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. పెన్షనర్ల సంఘం నాయకులు ఎం.కుప్పస్వామినాయుడు, కె.రామ్మూర్తి, టి.జయరామనాయుడు, జి.ఆంజినేయులు మాట్లాడుతూ కమ్యూటేషన్ కాలపరిమితిని పన్నెండేళ్లకు కుదించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఎన్.నారాయణ రెడ్డి, డి.మునస్వామి, ఎన్.మునిరత్నం రెడ్డి పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

భాకరాపేట, సెప్టెంబరు 30: రాష్ట్రస్థాయిలో జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో భాకరాపేట గీతాంజలి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు స్కూల్ కరస్పాండెంట్ గిరికుమార్ రెడ్డి తెలిపారు. సెప్టెంబరు 29న కర్నూలులో జరిగిన పోటీల్లో జిల్లా తరపున ఆడి మెరుగైన ప్రతిభ కనబరిచారన్నారు. విద్యార్థులు మూడవ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వ్యాయామ ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి, హెచ్ఎం స్వాతిలను ఆయన అభినందించారు.

నైపుణ్య పెంపుతో ఉద్యోగ సాధన



జ్యోతి వెలిగిస్తున్న శ్రీధర్, డాక్టర్ ప్రకాశ్‌రెడ్డి

తిరుపతి రూరల్, సెప్టెంబరు 30: చదువుతోపాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెంచుకుంటే మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చునని రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ కళాశాల(రిమ్స్)ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ప్రకాశ్‌రెడ్డి అన్నారు. బైరాగిపట్టెడలోని కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ(కంప్యూటర్‌సైన్స్)కోర్సుల విద్యార్థులకు సోమవారం ఉద్యోగ నైపుణ్యంపై పదిరోజుల సదస్సును ఆయన ప్రారంభించారు. సంస్థ డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ గోల్‌సెట్టింగ్, కమ్యూనికేషన్, లీడర్‌షిప్ స్కిల్స్, టీమ్‌వర్క్, క్రిటికల్ థింకింగ్, పాజిటివ్ యాటిట్యూడ్ వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. చైర్మన్ వై.కొండారెడ్డి, డైరెక్టర్లు వై.ఆనందరెడ్డి, వై.విజయ్‌రెడ్డి, హెచ్‌వోడీలు డాక్టర్ పి.నిరంజన్‌రెడ్డి, పి.మధుర, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ సమష్టి బాధ్యత



విద్యార్థులతో డాక్టర్ జగపతిరామయ్య, అధ్యాపకులు

తిరుపతిరూరల్, సెప్టెంబరు30: విద్యార్థులు పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఎస్వీవెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ పి.జగపతిరామయ్య సూచించారు. స్వచ్ఛతా హిసేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు స్వచ్ఛత పరిరక్షణ ప్రచార సామగ్రి అందజేశారు. వలంటీర్లకు మైభారత్ టోపీలు, బ్యాగులు, పుస్తకాలు వంటివి అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్వచ్ఛతపై గ్రామీణ ప్రాంత ప్రజల్లో చైతన్యం, అవగాహన కల్పించి సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఓఎస్ఏ డాక్టర్ ఆర్.వేణు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ అమరావతి, డాక్టర్ రాజా తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామలో ఆకట్టుకున్న హాక్తాన్-2కే24

తిరుపతిరూరల్, సెప్టెంబరు30: కరకంబాడిరోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఇంటర్నల్ హాక్తాన్-2కే24 ఆకట్టుకుంది. కళాశాల విద్యార్థులు తాము రూపొందించిన అధునాతన పరిశోధనాంశాలను ప్రదర్శించారు. ఈసందర్భంగా డైరెక్టర్ మన్నెం అరవింద్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్లీనమై ఉన్న ప్రతిభా నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడుతాయన్నారు. చైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర, కన్వీనర్ డాక్టర్ ఎన్.వాసు, కోఆర్డినేటర్ జమీల, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

7నుంచి గుడిమల్లానికి ఏపీ టూరిజం బస్సులు

ఏర్పేడు, సెప్టెంబరు 30: దేశంలో మొదటి శివాలయంగా గుర్తింపు పొందిన ఏర్పేడు మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయానికి తిరుపతి శ్రీనివాసం నుంచి ఈనెల 7 నుంచి బస్సులు నడుపుతున్నట్టు ఏపీ పర్యాటకాభివృద్ధి కార్పొరేషన్ డివిజన్ మేనేజరు గిరిధర్ తెలిపారు. గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయాన్ని ఏపీ టూరిజం అధికారులు సోమవారం సందర్శించారు. ఆలయ అర్చకులు పవన్‌శర్మ, వంశీకృష్ణశర్మ వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. నెల రోజుల క్రితం ఆలయ మాజీ చైర్మన్ బి.గిరినాయుడు ఏపీ టూరిజం అధిఆకరులకు గుడిమల్లం ఆలయానికి బస్సులు నడపాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన అధికారులు అక్టోబరు 7 నుంచి తిరుపతి శ్రీనివాసం నుంచి గుడిమల్లం ఆలయం వరకు బస్సులు నడుపుతున్నట్టు ప్రకటించారు.

సమావేశానికి సిబ్బంది..
వినతులకు ఇబ్బంది

- బోసిపోయిన తహసీల్దార్ కార్యాలయం
- ప్రజా ఫిర్యాదుల వేళ సమావేశానికి హాజరు

ఆంధ్రజ్యోతి విజిట్



సిబ్బందిలేక ఖాళీ కుర్చీలు

చంద్రగిరి, సెప్టెంబరు 30: మండల తహసీల్దార్ కార్యాలయం సోమవారం ఉదయం బోసిపోయింది. ప్రజా ఫిర్యాదుల దినాన్ని పురస్కరించుకుని ఆంధ్రజ్యోతి కార్యాలయాన్ని సందర్శించగా తక్కువ సిబ్బంది కనిపించారు. ఉదయం 9 గంటలకు కార్యాలయం తెరిచారు. డిప్యూటీ తహసీల్దార్ దివాకర్, ఆర్ఐ భాస్కర్, సర్వేయర్ సురేష్‌లు 10 గంటలకు చేరుకున్నారు. తహసీల్దార్ శివరామసుబ్బయ్య తిరుపతిలోని ఆర్డీవో కార్యాలయంలో అధికారిక సమావేశానికి వెళ్లారు. దీనికి కొందరు కార్యాలయ సిబ్బంది కూడా వెళ్లారు. దీనికితోడు వీఆర్వోలు బదిలీల నేపథ్యంలో సిబ్బంది, అధికారులు లేక కార్యాలయం వెలవెలబోయింది. ప్రజా ఫిర్యాదుల కార్యక్రమానికి డిప్యూటీ తహసీల్దార్ హాజరయ్యారు. బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. బందార్లపల్లె గ్రామానికి చెందిన రూపేష్ తన భూమి సమస్య నివేదించాడు. అక్కగార్లకాలనీలో వలస కార్మికులు తమకు మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు.

రూరల్ మండలంలోనూ అదే తీరు

తిరుపతిరూరల్: తిరుపతి రూరల్‌మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో పలువురు వినతులు సమర్పించారు. రెవెన్యూకు సంబంధించిన సమావేశం, కోర్టు కేసులు ఉండడంతో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్లు అందుబాటులో లేరు. అడిషనల్‌డీటీ లక్ష్మీపతికి బాధితులు వినతులను అందించారు.

మూడేళ్లుగా తిరుగుతున్నా..



గత వైసీపీ ప్రభుత్వంలో మూడేళ్ల క్రితం మా తాత పేరిట ఉన్న పట్టా భూమిని నా పేరుతో మార్చాలని మ్యూటేషన్ కట్టాను. అప్పటి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి తిరుగుతున్నాను. ఇప్పుడు మళ్లీ ఫిర్యాదు చేశాను. నోషనల్ ఖాతాలోని భూమిని మార్చాలంటే కలెక్టర్‌కు మాత్రమే అర్హత ఉన్నందున ఫైల్ పంపించి పరిష్కరిస్తామని డిప్యూటీ తహసీల్దార్ దివాకర్ చెప్పారు.

- రూపేష్, బందార్లపల్లె

మా భూమిని ఖాతాలోకి మార్చండి

మా గ్రామంలో సర్వేనెంబరు 198/2ఏలో మాకు 23సెంట్ల భూమి ఉంది. దీనిని సామిరెడ్డి అనే రైతు ఖాతా(పాస్‌బుక్)లోకి మార్చారు. భూమిని తాము ఇప్పటివరకు ఎవరికీ విక్రయించలేదు. కానీ సామిరెడ్డి కుటుంబీకులు భూమి తమదంటున్నారు. ఈవిషయమై ఐదునెలలుగా రెవెన్యూ అధికారులు చుట్టూ తిరుగుతున్నాను. వారు స్పందించడంలేదు. దివ్యాంగుడినైన నేను పదేపదే రావాలంటే ఇబ్బందిగా ఉంది.



- కృష్ణారెడ్డి, పాతకాల్వ

విద్యుత్ కనెక్షన్ కోసం తిప్పలు



వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం నాలుగు నెలలుగా తిరుగుతున్నా. దరఖాస్తు వీఆర్వో నుంచి తహసీల్దార్ కార్యాలయానికి చేరినట్లు తెలిసింది. తహసీల్దార్ కార్యాలయ అధికారులు రేపు, మాపు అంటూ తిప్పుతున్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన కనెక్షన్ మంజూరు చేయాలని కోరుతున్నాను.

- జనార్దన్, దుర్గసముద్రం

రెండు ద్విచక్ర వాహనాల ఢీ

- ఒకరి మృతి, మరొకరికి గాయాలు



జయపాల్‌నాయుడి మృతదేహం

చంద్రగిరి, సెప్టెంబరు 30: చంద్రగిరి మండలం ఐతేపల్లె వద్ద పూతలపట్టు, నాయుడుపేట జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు సోమవారం ముంగిలిపట్టుకు చెందిన జయపాల్‌నాయుడు(50) ద్విచక్ర వాహనంపై ఐతేపల్లె వద్ద సర్వీసు రోడ్డు నుంచి పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి దాటుతున్నారు. అదే సమయంలో పాకాల మండలం దామలచెరువుకు చెందిన మోహన్ చిత్తూరు నుంచి చంద్రగిరి బైకుపై వస్తూ ఈ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో జయపాల్ నాయుడుకు తీవ్ర గాయలయ్యాయి. మోహన్ కూడా గాయపడ్డాడు. ఇద్దరినీ చంద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు పరిక్షించి జయపాల్‌నాయుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని చంద్రగిరి సీహెచ్‌సీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టర్‌ను కలిసిన పలువురు అధికారులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాలాజీనాయక్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 30: సాధారణ బదిలీల్లో భాగంగా తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు వివిధ జిల్లాలకు బదిలీ అయ్యారు. వారి స్థానంలో కొత్త అధికారులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారిగా పనిచేస్తున్న ప్రకాష్ దాచేపల్లికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బాలాజీనాయక్ బాధ్యతలు చేపట్టారు. ఆయన కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సూళ్లూరుపేట ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన కిరణ్మయి, ఉమ్మడి జిల్లాల ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ కూడా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.




దీపారాధన కార్యక్రమంలో పాల్గొన్న జనసేన నేతలు

ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా
గంగమ్మగుడిలో దీపారాధన

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 30: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా సోమవారం రాత్రి తాతయ్యగుంట గంగమ్మగుడిలో జనసేన నేతలు దీపారాధన చేశారు. ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు పసుపులేటి డాక్టర్ హరిప్రసాద్, పట్టణాధ్యక్షుడు రాజారెడ్డి ఆధ్వర్యంలో దీపారాధన నిర్వహించారు. ప్రసాదాల కల్తీవల్ల జరిగిన అపచారం తొలగిపోవాలని వేడుకున్నారు. ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా మంగళవారం ఆలయాల్లో, యోగాకేంద్రాలలో నమో నారాయణాయ మంత్ర పఠనం, బుధవారం నగర సంకీర్తన, గురువారం ఆలయాల్లో భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మాధవరావు, హరిశంకర్, బాబ్జీ, హేమకుమార్, లోకేశ్, రాజేష్ ఆచారి, వెంకటేశ్, కీర్తన, ఆకుల వనజ, సుభాషిణి, దుర్గ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రిటైరైన పోలీసు అధికారులకు సన్మానం



పదవీ విరమణ పొందిన అధికారులతో ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 30: జిల్లా పరిధిలో రిటైరైన ట్రాఫిక్ స్టేషన్ ఏఎస్ఐ జనార్ధన నాయుడు, తిరుచానూరు ఏఎస్ఐలు జీవరత్నం, గోపాల్‌రెడ్డి, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ శంకరప్రసాద్ రెడ్డిలను పోలీసు పెరేడ్ మైదానంలో సోమవారం ఎస్పీ సుబ్బరాయుడు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖలో బాధ్యతాయుతంగా సేవలు అందించి పదవీ విరమణ పొందడం అభినందనీయమన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీటీడీలో దళితులపై వివక్ష దుర్మార్గం



మాట్లాడుతున్న అంజయ్య

తిరుపతి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల ధార్మిక సంస్థలో అడుగడుగునా ఎస్సీ, ఎస్టీ వర్కర్లపై అధికారులు వివక్షతో వ్యవహరిస్తున్నారని ఆర్పీఐ నేత అంజయ్య ఆరోపించారు. సోమవారం ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల హెల్త్ డిప్యూటీ ఈవోగా బాధ్యతలు చేపట్టిన ఆశాజ్యోతి.. రెండు నెలలుగా హెల్త్ విభాగంలో పనిచేస్తున్న దళిత సిబ్బందిని అవహేళన చేస్తూ అవమానిస్తున్నారని ఆరోపించారు. దీనికి తోడు హెల్త్ ఆఫీసర్ మధుసూదన్ సైతం అదే ధోరణి అవలంబిస్తున్నారన్నారు. తిరుమలలో మలమూత్రాలను శుభ్రం చేసే సుమారు 400 మంది అవుట్ సోర్సింగ్ వర్కర్లను తొలగించి మరింత పని భారాన్ని మోపారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి టీటీడీలో దళిత వర్కర్ల పట్ల జరుగుతున్న అరాచకాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గొడుగుచింత గోవిందయ్య, డీఎంసీ భాస్కర్, బాబు పాల్గొన్నారు.

దాసుకుప్పం హైస్కూల్‌లో మరోమారు విచారణ

సత్యవేడు, సెప్టెంబరు 30: మండలంలోని దాసుకుప్పం జడ్పీ హైస్కూల్‌లో నెలకొన్న వివాదానికి సంబంధించి సోమవారం అధికారుల బృందం విచారణ జరిపారు. పూర్వ హెచ్ఎం జ్యోతిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో డిప్యూటీ డీఈవో కృష్ణప్ప ఆధ్వర్యంలో పీలేరు ఎంఈవో లోకేశ్వర్, వడమాల పేట జడ్పీ హైస్కూల్ హెచ్ఎం కరుణ నవనీతం బృందం పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయులు, విద్యార్థులు, వంటకార్మికులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థుల నుంచి రాత పూర్వకంగా అభిప్రాయాలను సేకరించారు. హెచ్ఎం జ్యోతి ఈ ఏడాది ఫిబ్రవరికి సంబంధించిన వేతన బిల్లును బ్యాంకు ఖాతాలో జమ చేయకుండా కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఉపాధ్యాయులు అధికారులకు ఫి ర్యాదు చేశారు. దీంతో డీఈవో శేఖర్ జూలై 26న విచారించి ఆర్జేడీ అధికారులకు నివేదించారు. ఈనేపథ్యంలో హెచ్ఎం జ్యోతిని ఆగస్టులో రాజగోపాలపురం జడ్పీ హైస్కూ ల్‌కు బదిలీ చేశారు. ఆమె విధుల్లో చేరలేదు. ఆమె కూడా ఉన్నతా .అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారులు త్రీమెన్ కమిటీతో విచారణ జరిపారు. ఈ క్రమంలో అధికారులు అందరికీ ప్రశ్నాపత్రాలు ఇచ్చి అందులో తాము పేర్కొన్న అంశాలకు రాత పూర్వకంగా సమాధానం ఇవ్వాలని కోరారు. హెచ్ఎం జ్యోతి వ్యవహారంపై ఇప్పటికి నాలుగుసార్లు విచారణ జరపడం గమనార్హం.



గ్రంథాలను ఆవిష్కరిస్తున్న వీసీలు ప్రొఫెసర్ అప్పారావు, ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తదితరులు

సంస్కృత గ్రంథాల అనువాదానికి కృషి

తిరుపతి రూరల్, సెప్టెంబరు 30: సంస్కృత గ్రంథాలను భారతీయ భాషల్లోకి అనువాదం చేసే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి జరుగుతోందని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. అంతర్జాతీయ అనువాద దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వర్సిటీలో నిర్వహించిన రెండురోజుల జాతీయ సదస్సును ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావుతో కలసి ప్రారంభించారు. కృష్ణమూర్తి మాట్లాడుతూ వర్సిటీలో అనువాద విభాగం ద్వారా యూజీ(బీఏ), పీజీ(ఎంఏ), డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులను బోధిస్తున్నామన్నారు. ప్రొఫెసర్ అప్పారావు మాట్లాడుతూ..భాషలోని జ్ఞానాన్ని ఇతరులకు అందించే గొప్ప సాధనం అనువాదమని అభివర్ణించారు. రాష్ట్రపతి పురస్కార గ్రహీత ప్రొఫెసర్ కొంపెల్ల రామసూర్యనారాయణ మాట్లాడుతూ సంస్కృతం నుంచి తెలుగులోకి అనువదించే సందర్భంలో వచ్చే సమస్యలు, అనుసరించాల్సిన మెళకువలను విశదీకరించారు. తెలుగు, సంస్కృత భాషల్లో అనువదించిన చిలకలూరి చతుష్టయం, యోగిరాజ్ శ్రీశ్యామచరణ లాహిరీ-క్రియా యోగదర్శన విజ్ఞానం, భారతరత్న-అంబేడ్కర్ వర్యస్య సూక్తిమౌక్తికాని అనే మూడుగ్రంథాలను ఆవిష్కరించారు. అకడమిక్ డీన్ రజనీకాంత్‌శుక్లా, విద్వాన్ జనార్దన్ హెగ్డే, ఎడ్యుకేషన్ డీన్ ఎన్.లతా, కోఆర్డినేటర్స్ ఎంజీ నందనరావు, కనపాలకుమార్, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

టీటీడీ ఉద్యోగులకు సీపీఆర్‌పై శిక్షణ

తిరుమల, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఉద్యోగులకు కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్)పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం తిరుమలలోని అశ్విని ఆస్పత్రిలో ప్రారంభమైంది. ఆస్పత్రి మెడికల్ సూపరిటెండెంట్, సివిల్ సర్జన్ డాక్టర్ కుసుమకుమారి ఆధ్వర్యంలో టీటీడీ విజిలెన్స్, శ్రీవారి ఆలయం సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో భక్తులకు సేవలందించడానికి ఇచ్చే శిక్షణ మంగళవారం కూడా కొనసాగనుంది. స్విమ్స్ సీపీఆర్ టీం, అశ్విని ఆస్పత్రి వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యానికి ఇవాక్యుయేషన్ కమిటీ

తిరుమల, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో గరుడసేవ పూర్తయ్యాక అసంఖ్యాక యాత్రికుల సురక్షితంగా తరలించేందుకు టీటీడీ ఇవాక్యుయేషన్ కమిటీని ఏర్పాటు చేసింది. తిరుమల అన్నమయ్య భవనంలో సోమవారం జరిగిన బ్రహ్మోత్సవ ఏర్పాట్ల సమీక్షలో టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి ఈ విషయం తెలిపారు. గరుడసేవ దర్శనం పూరయ్యాక భక్తులు సురక్షితంగా వెలుపలకు చేరుకునేందుకు వీలుగా విజిలెన్స్ అధికారులతో ఈ కమిటీని ఏర్పాటు చేశామన్నారు.

పకడ్బందీగా పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 30: ఎకడ్బందీగా పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్‌ను చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఈఆర్వోలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్‌పై ఈఆర్వోలు, తహసీల్దార్లు, బీఎల్వోలు ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. దీనిని ఓటర్ల ప్రతిపాదికన చేపట్టాలని సూచించారు. సమావేశంలో జేసీ శుభం బన్సల్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, డీఆర్వో పెంచలకిషోర్, ఆర్డీవోలు కిరణ్మయి, రవిశంకర్ రెడ్డి, ఈఆర్వోలు రామ్మోహన్, నరసింహులు, ఎన్నికల సూపరింటెండెంట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత వంతెన కోసం నిరసన

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 30: మంగళంలోని కేటీఆర్ నగర్ మార్గంలో కల్వర్టు రెండు రోజుల క్రితం భారీ వర్షానికి కొట్టుకుపోయింది. రాకపోకలు స్తంభించడంతో స్థానికులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో మరో దారి ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. ఈనేపథ్యంలో పంచాయతీరాజ్ అధికారులు సోమవారం ఉదయం మరమ్మతులు ప్రారంభించారు. కొంతమేర పనులయ్యాక స్థానికులు అడ్డుకున్నారు. తమకు శాశ్వతంగా వంతెన ఏర్పాటు చేయాలని, లేదంటే పనులు ఆపేయాలని పట్టుబట్టారు. తేలికపాటి వర్షానికే నీరు వరదలా వచ్చి చేరుతోందని, తరచూ ఇలా కొట్టుకుపోతుండడంతో రాకపోకలు స్తంభిస్తున్నాయన్నారు. అధికారులు తిరిగే వెళ్లే వరకు స్థానికులు అక్కడే గుడారం వేసుకుని నిరసన వ్యక్తం చేశారు.

శ్రీసిటీ మ్యాంగో రిసార్ట్‌కు ప్రతిష్టాత్మక అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరావు

శ్రీసిటీ, సెప్టెంబరు 30: టూరిజం, హాస్పిటాలిటీ రంగంలో 2023 - 2024 సంవత్సరానికి ఉత్తమ పర్యావరణ అనుకూల హోటల్ (బెస్ట్ ఎకో ఫ్రెండ్లీ హోటల్) అవార్డును రాష్ట్రప్రభుత్వం నుంచి శ్రీసిటీలోని మ్యాంగో రిసార్ట్ హోటల్ అందుకుంది. ఇక్కడ అమలు చేస్తున్న స్థిరమైన ఆతిథ్య సేవలకు గాను ఈ గుర్తింపు దక్కింది. రాష్ట్ర యూత్ అడ్వాన్స్‌మెంట్ టూరిజం అండ్ కల్చరల్ సెక్రటరీ వి.వినయ్‌చంద్, టూరిజం అథారిటీ సీఈవో ఎం.అభిషిక్త్ కిషోర్ చేతుల మీదుగ మ్యాంగో రిసార్ట్ జనరల్ మేనేజర్ వై.శ్రీనివాసరావు అవార్డును అందుకున్నారు.

ఫ్లయింగ్‌స్క్వాడ్ డీఎఫ్‌వోగా శ్రీనివాసులు



మంగళం, సెప్టెంబరు 30: తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వోగా శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన తిరుపతి డీఎఫ్‌వోగా పనిచేశారు. ప్రకాశం డీఎఫ్‌వోగా విధులు నిర్వహిస్తూ తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వోగా బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

- గూడూరు ప్రత్యేకం

జెండా ఉత్సవం

- విజయ దశమికి ముందు వచ్చే అమావాస్య రోజున నిర్వహణ
- రేపు రాత్రి వేడుకలకు ముస్తాబైన పట్టణం

దసరా పండుగ అనగానే దక్షణాదిలోనే మైసూరు తర్వాత గూడూరులోనే ఘనంగా జరుగుతాయని ప్రతీతి. ఇక్కడ జరిగే జెండా ఉత్సవాలు ప్రత్యేకం. విజయదశమి ముందు వచ్చే అమావాస్య నాడు జరిగే ఈ ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహిస్తుంటారు. పట్టణం జన సంద్రమవుతుంది. ఈ ఏడాది బుధవారం రాత్రి జరగనున్న జెండా ఉత్సవాలకు పట్టణం ముస్తాబవుతోంది.

- గూడూరు



రూపుదిద్దుకుంటున్న ఆంజనేయస్వామి జెండా

జెండా ఉత్సవాలు మొదలైందిలా..

గ్రామం ఏర్పడిన తొలినాళ్లలో అరిష్టాలు ప్రబలి వ్యాధులు సోకుతున్నాయని ప్రజలు భీతిల్లేవారట. దీంతో ఆంజనేయస్వామిని పూజిస్తే కష్టాలు తొలగిపోతాయని భావించారంటా. దీంతో సుమారు 77 ఏళ్ల కిందట తొలిసారిగా బొడ్డుచౌక ప్రాంతంలోని శక్తిరాయి వద్ద ఆంజనేయస్వామి జెండాను ప్రతిష్ఠించినట్లు పెద్దలు చెబుతుంటారు. ఆరు గజాల తెల్లని గుడ్డపై సంజీవని పర్వతం తీసుకుని భూమిపై దిగుతున్న భంగిమలో అంజేయస్వామి చిత్రాన్ని బొగ్గుతో రూపొందించి, 8అడుగుల వెదురుకర్రకు అమర్చి..విజయదశమికి ముందు వచ్చిన అమావాస్యనాడు సాయంత్రం కాగడాల వెలుగులో.. తప్పెట్ల హోరునడుమ గ్రామోత్సం నిర్వహించినట్లు చెప్పుకుంటారు.దీని వల్ల అప్పట్లో వ్యాధులు తగ్గుముఖం పట్టడంతో ఏటా నిర్వహిస్తున్నారు.



50కి పైగా ప్రాంతాల్లో..

ప్రస్తుతం పట్టణం, సమీప ప్రాంతాలలో 50కి పైగా ఆంజనేయస్వామి జెండా ఉత్సవాలు జరుపుకొంటారు. కాలానుగుణంగా జెండాలు కూడా రంగులమయంగా మారాయి. సంజీవని పర్వతాన్ని మోసుకువస్తున్న ఆంజనేయ స్వామి చిత్రపటాన్ని వివిధ రంగులతో రూపొందించి ట్రాక్టరుపై ఉంచి గ్రామోత్సవం నిర్వహిస్తారు. పలు వీధులకు చెందిన వారు పోటాపోటీగా ఉత్సవాలను నిర్వహిస్తుంటారు. ఈ ఉత్సవాలకోసం ఇతర ప్రాంతాల్లో స్థిరపడి పట్టణానికి చెందిన వారు, వారి స్నేహితులు, బంధుమిత్రులు హాజరవుతారు.

విద్యుద్దీపాల వెలుగులు



జెండా ఉత్సవాల కోసం గూడూరు పట్టణంలో విద్యుద్దీపాలతో కటౌట్లు, అలంకరణలు పూర్తి చేశారు. ఇక, బుధవారం రాత్రి ఉత్సవాలకు ముందు తెనాలి బ్యాండు, బేతాళ, కాంతార నృత్యాలు, తప్పెట్లు, తాళాలు, కోలాటాలు, బొట్టబొమ్మల అభినయం, పార్వతి మహిషాసుర యుద్ధనాట్యాలు, బాణసంచా పేలుళ్ల, యువకుల చిందుల మధ్య సందడి నెలకొననుంది. ప్రధానంగా గమళ్లపాళెం, తూర్పువీధి, కర్ణాలవీధి, మిట్టపాళెం, కోనేటిమిట్ట, వీరారెడ్డిపల్లి, మాళవ్యానగర్, నరసింగరావుపేట, ఇందిరానగర్, అశోక్‌నగర్ తదితర ప్రాంతాలలో వైభవంగా జెండా ఉత్సవాలు నిర్వహిస్తారు. అనంతరం 3వ తేదీన కలశస్థాపనతో శరన్నవరాత్రులు మొదలవుతాయి.



తిరుపతి

అదనంగా మరో 7 పోలింగ్ కేంద్రాలు

తిరుపతి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నియోజకవర్గంలో 1500 మంది ఓటర్లు దాటిన ఏడు యాగ్జలరీ పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, ఈ నివేదికను జిల్లా ఎన్నికల అధికారికి సమర్పిస్తామని ఓటరు నమోదు అధికారి, కమిషనరు ఎన్.మౌర్య అన్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్-2025పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం ఆమె సమావేశమయ్యారు. ఆబ్సెంట్, షిఫ్ట్, డెత్ ఓటర్లకు సంబంధించి బీఎల్వో, బీఎల్ఏ సమక్షంలో క్షేత్ర స్థాయిలో విచారిస్తామన్నారు. ఈ సమావేశంలో ఏడీసీ చరణ్ తేజ్ రెడ్డి, డీసీ అమరయ్య, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, డీటీ జీవన్, టీడీపీ నేత కంకణాల రజినీ కాంత్, వైసీపీ కౌన్సిలర్ రామస్వామి వెంకటేశ్వర్లు, బీజేపీ నేత పొనగంటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రయోజనాలకోసమే..!

లడ్డూను వాడుకుంటున్నారంటూ కూటమి ప్రభుత్వంపై చింతా విమర్శ



తిరుపతి (వైద్యం), సెప్టెంబరు 30: శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని కూటమి ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆరోపించారు. లడ్డూ విషయంలో సుప్రీంకోర్టు అడిగిన ప్రశ్నలకు రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది నుంచి సమాధానాలు లేకపోవడం చూస్తుంటే ఈ విషయం తెలుస్తుందన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నిన్నటి వరకు నిద్రమత్తులో ఉన్న బీజేపీ ఇప్పుడు టీటీడీలో అవినీతి జరిగిందని లడ్డూను కల్తీ చేశారని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. రెండు రోజుల కిందట తిరుమలకు వచ్చిన అమిత్‌షా కుమారుడు జైషాకు సాయంకాల సమయంలో ప్రొటోకాల్ దర్శనం ఎలా కల్పించారని ప్రశ్నించారు. 30 యాక్ట్ పేరుతో సభలు, సమావేశాలు పెట్టకుండా నేతలను అడ్డుకోవడం ఏంటని ఆయన ప్రశ్నించారు. తిరుపతిలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ఉందని, ఎక్కడా ట్రాఫిక్ కానిస్టేబుల్ కూడా కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపి గౌడ్, అమీజ్ మజీద్ పటేల్, తేజోవతి, మునిశోభ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ సభను విజయవంతం చేద్దాం

తిరుపతి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తిరుపతిలో తలపెట్టిన వారాహి సభను విజయవంతం చేయాలని జానపద కళాకారుల సంఘం గౌరవ సలహాదారుడు, జనసేన నేత నరసింహులు నాయుడు, సంఘ వ్యవస్థాపకుడు యాదగిరి కోరారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడారు. 1న నమోనారాయణ మంత్రం, 2న నగర సంకీర్తన, 3న ఆలయాల్లో భజన కార్యక్రమాలు చేపట్టాక వారాహి సభకు పెద్దఎత్తున కళాకారులు హాజరుకానున్నారని చెప్పారు. ప్రధాన కార్యదర్శి మనేంద్ర, జనసేన నాయకుడు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో పీజీ కోర్సులకు 2వ కౌన్సెలింగ్, స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 30: శ్రీవెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) యూనివర్సిటీలో ఈ విద్యా సంవత్సరానికి ఎంఎస్సీ(నర్సింగ్), ఎంఎస్సీ, ఎంహెచ్ఎస్, పీజీ డిప్లొమా కోర్సులకు అక్టోబరు 4న ఉదయం 8.30 గంటలకు 2వ విడత కౌన్సెలింగ్, స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్ల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ(నర్సింగ్) 19, ఎంఎస్సీ క్లినికల్ వైరాలజీ 1, ఎంఎస్సీ కార్డియాక్ కాథెటరిజేషన్ ఇంటర్వెన్షన్ టెక్నాలజీ 1, ఎంఎస్సీ కార్డియో పల్మనరీ రిససిటేషన్ టెక్నాలజీ 2, పీజీ డిప్లొమా ఇన్ మెడికల్ రికార్డ్ సైన్సెస్ 7, పోస్ట్ బేసిక్ డిప్లొమా ఇన్ నర్సింగ్ ప్రోగ్రాంకు 23.. మొత్తం 53 సీట్లు అందుబాటులో ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరై సీటు పొందిన వెంటనే నిర్ణీత ఫీజును చెల్లించాల్సి ఉంటుందని ఆమె తెలిపారు. పూర్తి వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌ను చూడగలరన్నారు.

రామచంద్రయాదవ్‌కు ఘనస్వాగతం



రామచంద్రయాదవ్‌కు స్వాగతం పలుకుతున్న యాదవసంఘాల నాయకులు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 30: తిరుమల పరిరక్షణ పాదయాత్ర చేపట్టిన బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ సోమవారం ఉదయం అలిపిరి వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా అఖిలభారత యాదవ మహాసభ నాయకులు ఆర్ఆర్ యాదవ్, శీనుయాదవ్‌లు ఘనస్వాగతం పలికారు. అనంతరం గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుమలలో నెయ్యి కల్తీ జరిగిందని తెలిశాక ప్రభుత్వం, రాజకీయపార్టీలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. స్వామివారి చెంత తప్పుచేసినవారిని భవిష్యత్తులో మరో తప్పు చేయకుండా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. యాదవ సంఘాల నాయకులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేంద్రం సందర్శన



ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్ గుర్బీర్‌పాల్ సింగ్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 30: తిరుపతి ఎన్‌సీసీ గ్రూపును డైరెక్టర్ జనరల్ గుర్బీర్‌పాల్ సింగ్ సందర్శించారు. క్యాడెట్లకు అందిస్తున్న శిక్షణ, సదుపాయాలు, క్రమశిక్షణ వంటి అంశాలను ఆయన పరిశీలించారు. అంతకు ముందు క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా తిరుపతి ఎన్‌సీసీ గ్రూపు పరిధిలో చేపడుతున్న కార్యక్రమాలను సిబ్బంది వివరించారు. క్యాడెట్లకు శిక్షణతో పాటు మంచి అవకాశాలు కల్పించేలా చూడాలని అధికారులకు గుర్బీర్‌సింగ్‌పాల్ సూచించారు.

'ఆత్మ' డీడీకి పదోన్నతి

తిరుపతి (ఎంఆర్‌పల్లి), సెప్టెంబరు 30: జిల్లా ఆత్మ ప్రాజెక్ట్ డిప్యూటీ డైరెక్టర్ రత్నప్రసాద్ వ్యవసాయ శిక్షణ సమన్వయకర్తగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయనకు తాజాగా కర్నూలు జిల్లా ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించారు. ఆయన స్థానంలో సీనియర్ ఏడీఏ భాస్కరయ్య బాధ్యతలు స్వీకరించారు.

తిరుపతికి చేరిన దమ్మ యాత్ర



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి, నైనారు శ్రీనివాసులు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 30: తిరుపతిలో అశోక - అంబేడ్కర్ దమ్మ యాత్ర శోభాయమానంగా సాగింది. బౌద్ధ భిక్షువులు, దమ్మ మిత్రులు తిరువనంతపురం నుంచి ప్రారంభించిన అశోక - అంబేడ్కర్ దమ్మ యాత్ర సోమవారం తిరుపతి చేరుకుంది. ఆర్టీసీ బస్టాండు వద్ద అంబేడ్కర్ విగ్రహం నుంచి బాలాజీ కాలనీలోని అంబేడ్కర్ భవన్ దాకా ర్యాలీ సాగింది. ర్యాలీని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కూటమి నాయకులు నైనారు శ్రీనివాసులు జెండా ఊపి ప్రారంభించారు. గౌతమ బుద్ధుడు ప్రపంచంలో దుఃఖ నివారణకు రాజ్య త్యాగం చేశారని కొనియాడారు. అంబేడ్కర్ భవన్ చైర్మన్ పరమశివన్, బుద్ధిస్టులు మునిరత్నం, భాస్కరరావు, రాజమాణిక్యం, ఇంద్రముని, కృష్ణయ్య, పుష్పరాజ్, మొగిలయ్య, దినకరమూర్తి, ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



ముఖ్య అతిథులతో విజేతలు

తిరుపతి (విద్య), సెప్టెంబరు 30: మబ్బు సూర్యనారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ (ఎంఎస్ఎన్‌సీటీ)ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గాంధీ జయంతి పురస్కరించుకుని స్థానిక పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ స్కూల్ విద్యార్థులకు సోమవారం వ్యాసరచన, వక్తృత్వం, దేశభక్తి గీతాలు, దేశ నాయకుల వస్త్రధారణలపై పోటీలు జరిగాయి. కార్యక్రమానికి డిప్యూటీ డీఈఓ బాలాజీ, ఎంఈఓ-2 భాస్కర్‌నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.ట్రస్ట్ చైర్మన్ మబ్బు సూర్యనారాయణ రెడ్డి, హెచ్‌ఎం మునిశేఖర్, ట్రస్ట్ కోఆర్డినేటర్ రేవంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి గొడుగులకు ఎమ్మెల్యే పూజలు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 30: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలలో వినియోగించడానికి చెన్నైనుంచి వచ్చిన గొడుగులకు స్థానిక కోదండ రామాలయం వద్ద సోమవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పూజలు నిర్వహించి స్వాగతం పలికారు. అనంతరం గొడుగుల బృందం తిరుమలకు బయలుదేరి వెళ్లింది. స్వామి వారి బ్రహ్మోత్సవాలకు పది రోజుల ముందు చెన్నైలో హిందూ ధర్మార్థసమితి బృందం గొడుగులతో బయలుదేరుతుంది. సంస్థ అధ్యక్షుడు ఆర్.ఆర్.గోపాల ఆధ్వర్యంలో వచ్చిన బృందానికి ఎమ్మెల్యే ఆరణి స్వాగతం పలికారు. బీజేపీ నేతలు సామంచి శ్రీనివాస్, గుండాల గోపినాథ రెడ్డి, జీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ బధిరుల దినోత్సవం



తిరుపతి(గాంధీరోడ్డు), సెప్టెంబరు 30: ప్రపంచ బధిరుల దినోత్సవాన్ని టీటీడీ హియరింగ్ హ్యాండీక్యాప్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా టీటీడీలోని ఉద్యోగసేవలో ప్రతిభచాటిన ఉద్యోగులు, పలు ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు వెల్ఫేర్ ఆఫీసర్ ఆనంద్‌రాజు బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు సి.సునీల్‌కుమార్ యాదవ్, ఎం.శ్రీబాబు, చంద్రశేఖర్, హరిహరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూలోనే రాజకీయ పాఠాలు నేర్చుకున్నా

- అభినందన సభలో శాప్ చైర్మన్ రవి నాయుడు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 30: ఎస్వీ యూనివర్సిటీ తనకు చదువుతో పాటు రాజకీయ పాఠాలు నేర్పించిందని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవి నాయుడు అన్నారు. ఎస్వీయూ సెనేట్ హాల్లో సోమవారం టీఎన్ఎస్ఎఫ్- తెలుగు యువత సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సభలో ఆయన ప్రసంగించారు. ఎస్వీయూ విద్యార్థిగా, విద్యార్థి నేతగా అందరి సహకారంతో ఎదిగానని అన్నారు. శాప్ చైర్మన్‌గా పని చేసే క్రమంలో పూర్వ విద్యార్థిగా ఎస్వీ యూనివర్సిటీకి ఎలాంటి చెడ్డ పేరు తీసుకురానని స్పష్టం చేశారు. విద్యారంగ సమస్యలపై రవినాయుడు నిరంతరం పోరాటం చేశారని సభాధ్యక్షత వహించిన డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి అన్నారు. శాప్ చైర్మన్‌గా ఆయన నియామకం వర్సిటీకి గర్వకారణమని డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్ పేర్కొన్నారు. టీఎన్ఎస్ఎఫ్‌లో పనిచేసిన ఆయనకు మంచి పదవి రావడం సంతోషకరమని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్‌గౌడ్ చెప్పగా.. రాజకీయాల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని డాక్టర్ ధూపాటి ఉదయ్ కుమార్ ఆకాంక్షించారు. రవి నాయుడిని విద్యార్థులు, ఉద్యోగులు, విద్యార్థి, ఉద్యోగ సంఘాల నాయకులు సన్మానించారు. కూటమి నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, రమణయ్య, రామ్మోహన్, ఆర్కే. నాయుడు, అశోక్, హేమంత్‌రాయల్, డాక్టర్ కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

లైబ్రరీతో ఎంతో అనుబంధం



సన్మానిస్తున్న సురేంద్రనాయుడు తదితరులు

సైన్స్ విద్యార్థిగా తనకు ఎస్వీయూ లైబ్రరీతో ఎంతో అనుబంధం ఉందని శాప్ చైర్మన్ రవినాయుడు గుర్తు చేసుకున్నారు. యూనివర్సిటీ ప్రధాన గ్రంథాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.సురేంద్ర నాయుడు, ఉద్యోగులు ఆయన్ను సత్కరించారు.

ఒలింపిక్స్ స్థాయికి ఎదగాలి : మన రాష్ట్రంలోని క్రీడాకారులు ఒలింపిక్స్ దాకా పోటీ పడాలని శాప్ చైర్మన్ రవినాయుడు ఆకాంక్షించారు. పద్మావతి జూనియర్ కాలేజీలో నిర్వహించిన క్రీడాకారుల అభినందన సభలో ఆయన మాట్లాడారు. గ్రామీణ స్థాయి నుంచీ క్రీడాకారులను గుర్తించి వారికి అవసరమైన తోడ్పాటును ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రిన్సిపాల్ భువనేశ్వరీదేవి, పీడీ సుమతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యాటక, ఆతిథ్య రంగాలకు పుష్కల అవకాశాలు



తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణను సన్మానిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 30: జిల్లాలో పర్యాటక, ఆతిథ్య రంగాలకు పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని, అందరి సమన్వయంతో అభివృద్ధి చేస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు ఆఫ్ ఎక్సలెన్స్ 2023-24ను జిల్లా నుంచి అందుకున్న పలువురిని కలెక్టర్ సోమవారం కలెక్టరేట్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యాటకం, ఆతిథ్య రంగంలో ఉత్తమ జిల్లాగా తిరుపతికి రాష్ట్రస్థాయిలో ఐదు అవార్డులు రావడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో హెరిటేజ్, ఆధ్యాత్మిక, టూరిజం రంగాల్లో అవకాశాలు ఉన్నాయని చెప్పారు. తిరుమల, శ్రీకాళహస్తి, సురుటుపల్లి తదితర పుణ్యక్షేత్రాలను సందర్శించేలా టూరిజం అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని అటవీ ప్రాంతంలో ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదకరమైన జలపాతాలు, బీచ్‌లు కూడా ఉన్నాయని చెప్పారు. అనంతరం అవార్డుగ్రహీతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో అవార్డు గ్రహీతలు రితేష్ చౌదరి, సత్యనారాయణ, ఇందిర ప్రియదర్శిని, కృష్ణమూర్తి, జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచలకిషోర్, అధికారులు రమణప్రసాద్, రూపేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గేష్‌కు ఘన సన్మానం



దుర్గేష్ సామ్రాట్‌ను సన్మానిస్తున్న దృశ్యం

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 30: ఆదాయపుపన్ను ముఖ్యకార్యదర్శి దుర్గేష్ సామ్రాట్ (ఐఆర్ఎస్) సోమవారం పదవీ విరమణ చేసిన సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనను ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక ఓ హోటల్లో జరిగిన కార్యక్రమానికి ఇన్‌కమ్‌టాక్స్ చీఫ్ కమిషనర్లు బత్తిన సురేష్, ఎం.అనిల్‌కుమార్, పి.పీర్యా, తిరుపతి, కర్నూలు, నెల్లూరు రేంజ్, చెన్నై ఆదాయపుపన్ను అధికారులు పాల్గొన్నారు. వీరితోపాటు తిరుపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్ల తరపున చార్టెడ్ అకౌంటెంట్లు, ఇన్‌కమ్‌టాక్స్ ప్రాక్టీషనర్లు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ నుంచి వ్యాపారవేత్తలు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. శాలువ కప్పి సన్మానించి, ఆయన సేవలను కొనియాడారు.

అలరించిన భరత్‌శర్మ ప్రవచనం



తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 30: తిరుపతికి చెందిన యువ శతావధాని ఉప్పలదడియం భరత్‌శర్మ ప్రవచనం ప్రేక్షకులను అలరించింది. సోమవారం సాయంత్రం స్థానిక అన్నమాచార్య కళామందిరంలో వామనావతార వైభవంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన బలిచక్రవర్తి వృత్తాంతం, శ్రీమహావిష్ణువు లీలలను వివరిస్తూ, పోతన భాగవత పద్యాలను శ్రావ్యంగా ఆలపించి సభను రంజింపజేశారు. అనంతరం అన్నమాచార్య కళామందిరం అధికారి కోకిల, చిత్రపు హనుమంతరావు, గుండాల గోపీనాథ్ రెడ్డిలు అవధానిని ఘనంగా సత్కరించారు.

టీటీడీకి 16 ఎలక్ట్రిక్ స్కూటర్ల వితరణ



టీటీడీకి ఎలక్ట్రిక్ స్కూటర్లను అందజేస్తున్న దాతలు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 30: టీవీఎస్ మోటార్ కంపెనీ లిమిటెడ్ ద్వారా తాజా సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన అత్యాధునిక పది ఎలక్ట్రిక్ బైక్‌లు విరాళంగా అందాయి. రూ.16లక్షల విలువచేసే టీవీఎస్ ఐక్యూబ్ ఎలక్ట్రిక్ వెహికల్స్‌కు సోమవారం స్థానిక టీటీడీ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. దాతలైన స్థానిక శ్రీనివాస టీవీఎస్ డీలర్ ఓనర్స్ పి.భక్తవత్సలం, పి.ఆర్.సిద్ధార్థలు ట్రాన్స్‌పోర్ట్ జీఎం శేషారెడ్డికి వాహనాలతో పాటు సంబంధించిన ఫైళ్లను అందజేశారు.

ఆయుష్మాన్ భారత్ పోస్టరు ఆవిష్కరణ

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 30: కలెక్టరేట్‌లో సోమవారం ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన పోస్టర్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆవిష్కరించారు. ఆయుష్మాన్ భారత్‌యోజన 6వ వార్షికోత్సవం సందర్భంగా ఆయుష్మాన్ పక్వాడా వేడుకల్లో భాగంగా జిల్లాలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో గుర్తించిన మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఉచిత ఓపీ సేవలు నిర్వహించాలన్నారు. డీఎంహెచ్‌వో శ్రీహరి, డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ కోఆర్డినేటర్ రాజశేఖర్, అధికారులు శివకుమార్, ఆనందమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 85 ఫిర్యాదులు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 30: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఎస్పీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మొత్తం 85 ఫిర్యాదులు అందాయి.జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన పలువురు తమ ఆవేదనను ఎస్పీకి వివరించారు. అన్ని సమస్యలను ఓపిగ్గా విన్న ఎస్పీ, అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, నాగభూషణరావు కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు.

అమ్మవారి చీరల వేలం

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 30: గ్రామశక్తి పోలేరమ్మ అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను సోమవారం వేలం వేశారు.

ఈ పంట నమోదు తనిఖీలు

కోట, సెప్టెంబరు 30: మండల పరిధిలోని తిన్నెలపూడి, లక్ష్మక్కకండ్రిగ, తాటితోపు, వెంకన్న పాళెం గ్రామాల్లో ఖరీఫ్‌లో సాగుచేసిన ఈ పంట నమోదుపై వ్యవసాయ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. ఇటీవల మండలంలో 3,500 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు ఈ పంట నమోదు చేశారు. వ్యవసాయశాఖ ఏడీఏ సుచేంద్రప్రసాద్, ఏవో నిరంజన్‌కుమార్, సహాయ వ్యవసాయశాఖ అధికారులు ఆయా గ్రామాల్లోని వరి పంటలను పరిశీలించారు.

● గూడూరు ప్రత్యేకం

జెండా ఉత్సవం

దసరా పండుగ అనగానే దక్షణాదిలోనే మైసూరు తర్వాత గూడూరులోనే ఘనంగా జరుగుతాయని ప్రతీతి. ఇక్కడ జరిగే జెండా ఉత్సవాలు ప్రత్యేకం. విజయదశమి ముందు వచ్చే అమావాస్య నాడు జరిగే ఈ ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహిస్తుంటారు. పట్టణం జన సంద్రమవుతుంది. ఈ ఏడాది బుధవారం రాత్రి జరగనున్న జెండా ఉత్సవాలకు పట్టణం ముస్తాబవుతోంది.

- గూడూరు



రూపుదిద్దుకుంటున్న ఆంజనేయస్వామి జెండా

● విజయ దశమికి ముందు వచ్చే అమావాస్య రోజున నిర్వహణ
● రేపు రాత్రి వేడుకలకు ముస్తాబైన పట్టణం

జెండా ఉత్సవాలు మొదలైందిలా..

గ్రామం ఏర్పడిన తొలినాళ్లలో అరిష్టాలు ప్రబలి వ్యాధులు సోకుతున్నాయని ప్రజలు భీతిల్లేవారట. దీంతో ఆంజనేయస్వామిని పూజిస్తే కష్టాలు తొలగిపోతాయని భావించారంటా. దీంతో సుమారు 77 ఏళ్ల కిందట తొలిసారిగా బొడ్డుచౌక ప్రాంతంలోని శక్తిరాయి వద్ద ఆంజనేయస్వామి జెండాను ప్రతిష్ఠించినట్లు పెద్దలు చెబుతుంటారు. ఆరు గజాల తెల్లని గుడ్డపై సంజీవని పర్వతం తీసుకుని భూమిపై దిగుతున్న భంగిమలో ఆంజేయస్వామి చిత్రాన్ని బొగ్గుతో రూపొందించి, 8అడుగుల వెదురుకర్రకు అమర్చి..విజయదశమికి ముందు వచ్చిన అమావాస్యనాడు సాయంత్రం కాగడాల వెలుగులో.. తప్పెట్ల హోరునడుమ గ్రామోత్సం నిర్వహించినట్లు చెప్పుకుంటారు.దీని వల్ల అప్పట్లో వ్యాధులు తగ్గుముఖం పట్టడంతో ఏటా నిర్వహిస్తున్నారు.



50కి పైగా ప్రాంతాల్లో..

ప్రస్తుతం పట్టణం, సమీప ప్రాంతాలలో 50కి పైగా ఆంజనేయస్వామి జెండా ఉత్సవాలు జరుపుకొంటారు. కాలానుగుణంగా జెండాలు కూడా రంగులమయంగా మారాయి. సంజీవని పర్వతాన్ని మోసుకువస్తున్న ఆంజనేయస్వామి చిత్రపటాన్ని వివిధ రంగులతో రూపొందించి ట్రాక్టరుపై ఉంచి గ్రామోత్సవం నిర్వహిస్తారు. పలు వీధులకు చెందిన వారు పోటాపోటీగా ఉత్సవాలను నిర్వహిస్తుంటారు. ఈ ఉత్సవాలకోసం ఇతర ప్రాంతాల్లో స్థిరపడి పట్టణానికి చెందిన వారు, వారి స్నేహితులు, బంధుమిత్రులు హాజరవుతారు.

విద్యుద్దీపాల వెలుగులు



జెండా ఉత్సవాల కోసం గూడూరు పట్టణంలో విద్యుద్దీపాలతో కటౌట్లు, అలంకరణలు పూర్తి చేశారు. ఇక, బుధవారం రాత్రి ఉత్సవాలకు ముందు తెనాలి బ్యాండు, బేతాళ, కాంతార నృత్యాలు, తప్పెట్లు, తాళాలు, కోలాటాలు, బొట్టుబొమ్మల అభినయం, పార్వతి మహిషాసుర యుద్ధనాట్యాలు, బాణసంచా పేలుళ్ల, యువకుల చిందుల మధ్య సందడి నెలకొననుంది. ప్రధానంగా గమళ్లపాళెం, తూర్పువీధి, కర్ణాలవీధి, మిట్టపాళెం, కోనేటిమిట్ట, వీరారెడ్డిపల్లి, మాళవ్యానగర్, నరసింగరావుపేట, ఇందిరానగర్, అశోక్‌నగర్ తదితర ప్రాంతాలలో వైభవంగా జెండా ఉత్సవాలు నిర్వహిస్తారు. అనంతరం 3వ తేదీన కలశస్థాపనతో శరన్నవరాత్రులు మొదలవుతాయి.



పుత్తూరు వార్తలు

పన్నుల అధ్యయనం కోసం..
బెంగళూరు కార్పొరేషన్‌కు మున్సిపల్ కమిషనర్



మంజునాథ్ గౌడ్

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 30: ఇంటి పన్నుల అధ్యయనం కోసం పురపాలక శాఖ రాయలసీమ జిల్లాల రీజనల్ డైరెక్టర్‌తో పాటు పుత్తూరు, కల్యాణదుర్గం మున్సిపల్ కమిషనర్లతో కూడిన బృందాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆర్డీ విశ్వనాథ్, పుత్తూరు కమిషనర్ మంజునాథ గౌడ్, కల్యాణదుర్గం కమిషనర్ సోమవారం బెంగుళూరు కార్పొరేషన్‌కు బయలుదేరి వెళ్లారు. కర్ణాటక రాష్ట్రంలో ఇంటి పన్నుల శ్లాబులు, వసూళ్ల తదితర అంశాల్లో వ్యత్యాసాలను కమిటీ అధ్యయనం చేయనుంది. అక్టోబర్ 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు అధ్యయనం చేయనున్నారు.

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా మూర్తి

పుత్తూరు మున్సిపల్ ఇన్‌ఛార్జ్ కమిషనర్‌గా టీపీవో వీఎల్ఎన్ మూర్తికి బాధ్యతలు అప్పగించారు. కమిషనర్ బెంగుళూరు కార్పొరేషన్ పర్యటన నేపథ్యంలో మూడు రోజుల పాటు కమిషనర్ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. పుత్తూరు మున్సిపల్ ఏఈగా రమేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఈ నగరి మున్సిపాలిటీకి బదిలీపై వెళ్లారు.

ఎక్సైజ్ సీఐ బాధ్యతల స్వీకరణ



మురళీ మోహన్

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 30: పుత్తూరు ఎక్సైజ్ శాఖ సీఐగా మురళీ మోహన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిబంధనల మేరకే మద్యం విక్రయాలుంటాయన్నారు. అలాగే నిర్దిష్ట సమయంలోనే బార్లు తెరవాలని స్పష్టం చేశారు. ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా మద్యం దుకాణాలు, బార్ యాజమాన్యం వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కాగా పుత్తూరు ఎక్సైజ్ శాఖ పరిధిలో ఇది వరకే ఎస్ఐ, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఆరుగురు కానిస్టేబుళ్లబదిలీ అయ్యారు. నంద్యాల నుంచి ఎస్ఐ అంజాద్‌బాషా, ముద్దనూరు నుంచి ఎస్ఐ శివప్రసాద్ బదిలీపై వచ్చారు. హెడ్ కానిస్టేబుళ్ల, కానిస్టేబుళ్ల ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు బదిలీపై రానున్నారు.

సెలవుపై పుత్తూరు సీడీపీవో

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 30: పుత్తూరు సీడీపీవో పద్మలత అనారోగ్య కారణంగా రెండు నెలల సెలవుపై వెళ్లనున్నారు. గత నెలలో సెలవుకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే విజయవాడ వరద సహాయక చర్యల్లో అధికారులు ఉండడంతో సెలవు మంజూరు కాలేదు. 2015 నుంచి ఆమె పుత్తూరు సీడీపీవోగా కొనసాగుతున్నారు. ఈ ఏడాది డిసెంబర్ నెలకు పది సంవత్సరాల కాలం పూర్తి చేసుకున్నారు. అవుట్ సోర్సింగ్ పద్ధతిలో సీడీపీవోగా ఉన్న పద్మలత 2019లో మూడు నెలలు సెలవుపై వెళ్లి తిరిగి పుత్తూరులో కొనసాగడం గమనార్హం. ఈ రెండు నెలల కాలంలో అంగన్‌వాడీ కేంద్రాలు, గర్భిణులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పౌష్టిక ఆహారం పంపిణీకి ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

చేనేత రంగ అభివృద్ధికి కృషి

● పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య



పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 30: చేనేత రంగ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య అన్నారు. సోమవారం ఆయన నివాసంలో మాధవయ్యను చేనేత కార్మిక యూనియన్ నాయకులు, కార్మికులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా మంత్రి లోకేశ్ ఉండటం, అక్కడ నేతన్నలు ఎక్కువ సంఖ్యలో ఉండడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా చేనేతల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తిరుపతి, చిత్తూరు జిల్లాలో చేనేత కుటుంబాలను కలిసి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని మాధవయ్య చెప్పారు. చేనేత కార్మిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏ.వాసు, గౌరవ అధ్యక్షుడు కేవీ కుప్పయ్య, ప్రధాన కార్యదర్శి షణ్ముగ వర్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు స్పందన అంతంతమాత్రం

పుత్తూరు/ వడమాలపేట, సెప్టెంబరు 30: పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ డే ప్రజల నుంచి స్పందన అంతంత మాత్రమే వచ్చింది. 15 ఫిర్యాదులు మాత్రమే రాగా పెండింగ్ సమస్యల మీద వినతులు అందలేదని తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. కాగా కేబీఆర్ పురానికి చెందిన పద్మావతి ఈనెల 17న వ్యవసాయ భూమికి సంబంధించిన వివరాలు కావాలని తన తల్లి కామాక్షమ్మ పేరుమీద ఆర్‌టీఐ కింది అర్జీ ఇచ్చామని ఇప్పటి వరకు వివరాలు ఇవ్వలేదని ఆంధ్రజ్యోతికి తెలిపారు. కార్యాలయంలో సిబ్బంది కొరతతో పాటు వివరాలు ఇచ్చేందుకు 30 రోజుల వ్యవధి ఉందని అధికారులు తెలిపారు. రెవెన్యూ పరంగా సోమవారం ఏడు అర్జీలు వచ్చినట్లు వడమాలపేట తహసీల్దార్ జరీనా చెప్పారు. నాలుగు కుల ధ్రువీకరణ, రెండు పాస్ బుక్ లకోసం, ఒకటి ఫించన్ కోసం వచ్చినట్లు చెప్పారు.

కళాశాల మైదానానికి గేటు ఏర్పాటు



పుత్తూరు, సెప్టెంబరు 30: పట్టణంలోని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానానికి వెళ్లే దారి సమస్యను కళాశాల అధికారులు పరిష్కరించారు. కళాశాల మైదానంలోకి సాధన చేసే యువకులు, స్థానికులు వెళ్లకుండా పెద్ద గొయ్యి తవ్వారు. దీనిపై సీపీఐ నాయకులు కళాశాల యాజమాన్యంతో చర్చించింది. గొయ్యి పూడ్చి గేటు ఏర్పాటు చేసేందుకు అధికారులు అంగీకరించి వెంటనే పనులు ప్రారంభించారు. కళాశాల పని చేసే సమయంలో గేటును మూసి వేయనున్నారు.

లివర్ బాధిత చిన్నారికి జనసేన చేయూత

పుత్తూరు, సెప్టెంబరు 30: మండలంలోని నందిమంగళం గ్రామంలో లివర్ వ్యాధితో బాధ పడుతున్న ఆరేళ్ల చిన్నారి మోక్షితకు భవాని విష్ణు దాత ఇచ్చిన పదివేల రూపాయల విరాళాన్ని జనసేన నగరి ఇన్‌చార్జి ఎం.మహేష్ సోమవారం బాధిత కుటుంబానికి అందించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి
ఎమ్మెల్యే విజయశ్రీ



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే, పక్కన ఆర్డీవో

సూళ్లూరుపేట, సెప్టెంబరు 30: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో కిరణ్మయి ఆధ్వర్యంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏవో రవికుమార్, టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు వీఆర్వోల నియామకం

ఓజిలి, సెప్టెంబరు 30: ఓజిలి వీఆర్వోగా రామచంద్ర రాజు, చిల్లమానుచేను వీఆర్వోగా జయరామయ్యను నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, మండలంలోని ఇనుగుంట వీఆర్వో ప్రసాద్ బాలాయపల్లి మండలానికి బదిలీ అయ్యారు.

సమస్యలు పరిష్కరించండి

గూడూరు అర్బన్, సెప్టెంబరు 30: గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో పలువురు తమ సమస్యలను పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతులు అందజేశారు. గూడూరు మండలం గొల్లపల్లిలో పందుల సంచారంతో అంటువ్యాధులు ప్రబలు తున్నాయని, పందుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విన్న వించారు. చిల్లకూరు మండలం తూర్పుకనుపూరు గ్రామానికి చెందిన వెంకట సుబ్బమ్మ పోర్టులో కర్మాగార నిర్మాణం కోసం తన 1.30ఎకరాల భూమిని ప్రభుత్వం 2012లో తీసుకుని, ఇప్పటి వరకు పరిహారం చెల్లించలేదని, న్యాయం చేయాలని విన్నవించింది.

నేడే శ్రీవారి గొడుగుల సమరస యాత్ర

పుత్తూరు, సెప్టెంబరు 30: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో తిరుమల బ్రహోత్సవాలకు ఆనవాయితీగా చెన్నై నుంచి తీసుకువచ్చే శ్రీవారి గొడుగుల సమరసత యాత్ర మంగళవారం పుత్తూరు పట్టణం పురవీధుల్లో జరుగుతుందని శివానంద స్వామి, కైలాసనందగిరి స్వామి, కృష్ణచైతన్య స్వామి తెలిపారు. ఆర్డీఎం రైల్వే గేటు వద్ద ఉదయం 8 గంటలకు పూజలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అంబేడ్కర్ సర్కిల్, బజారు వీధి, కాపు వీధుల మీదుగా గొడుగుల ఊరేగింపు జరుగుతుంది.

రాష్ట్రస్థాయి పోటీలకు గొల్లపల్లి క్రీడాకారుల ఎంపిక



పుత్తూరు, సెప్టెంబరు 30: రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు మండలంలోని గొల్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిది మంది క్రీడాకారులు ఎంపికయ్యారని హెచ్‌ఎం భారతి తెలిపారు. నెట్‌బాల్ అండర్ 17 బాలుర విభాగంలో మునిమోహిత్, చరణ్‌తేజ, ధనుష్, బాలికల విభాగంలో చంద్రకళ, జనని, సంధ్య, శృతి, హ్యాండ్‌బాల్ అండర్ 17 బాలికల విభాగంలో హేమనందిని ఎంపికయ్యారు.

జిల్లాస్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థులు



కేవీబీపురం, సెప్టెంబరు 30: నాగలాపురం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 28న జరిగిన స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ నియోజకవర్గస్థాయి పోటీల్లో కబడ్డీ విభాగంలో కేజీబీవీ విద్యార్థులు మధుమిత, నవనీత ఎంపికయ్యారు. యోగాలో భానుప్రియ, అంజు, వాలీబాల్‌లో మధుమిత జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. వారిని సోమవారం ప్రిన్సిపాల్ సుకన్య, పీఈటీ సతీసావిత్రి, ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లాలో పర్యాటక, ఆతిథ్య రంగాలకు పుష్కల అవకాశాలు



తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణను సన్మానిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 30: జిల్లాలో పర్యాటక, అతిథ్య రంగాలకు పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని, అందరి సమన్వయంతో అభివృద్ధి చేస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు ఆఫ్ ఎక్సలెన్స్ 2023-24ను జిల్లా నుంచి అందుకున్న పలువురిని కలెక్టర్ సోమవారం కలెక్టరేట్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యాటకం, ఆతిథ్య రంగంలో ఉత్తమ జిల్లాగా తిరుపతికి రాష్ట్రస్థాయిలో ఐదు అవార్డులు రావడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో హెరిటేజ్, ఆధ్యాత్మిక, టూరిజం రంగాల్లో అవకాశాలు ఉన్నాయని చెప్పారు. తిరుమల, శ్రీకాళహస్తి, సురుటుపల్లి తదితర పుణ్యక్షేత్రాలను సందర్శించేలా టూరిజం అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని అటవీ ప్రాంతంలో ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదకరమైన జలపాతాలు, బీచ్‌లు కూడా ఉన్నాయని చెప్పారు. తాను కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పర్యాటక, అతిథ్య రంగాన్ని పక్కా ప్రణాళికతో ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు. అనంతరం అవార్డుగ్రహీతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో అవార్డు గ్రహీతలు రితేష్ చౌదరి, సత్యనారాయణ, ఇందిర ప్రియదర్శిని, కృష్ణమూర్తి, జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచలకిషోర్, అధికారులు రమణప్రసాద్, రూపేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీ మ్యాంగో రిసార్ట్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరావు

శ్రీసిటీ, సెప్టెంబరు 30: టూరిజం, హాస్పిటాలిటీ రంగంలో 2023 - 2024 సంవత్సరానికి ఉత్తమ పర్యావరణ అనుకూల హోటల్ (బెస్ట్ ఎకో ఫ్రెండ్లీ హోటల్) అవార్డును రాష్ట్రప్రభుత్వం నుంచి శ్రీసిటీలోని మ్యాంగో రిసార్ట్ హోటల్ అందుకుంది. ఇక్కడ అమలు చేస్తున్న స్థిరమైన ఆతిథ్య సేవలకు గాను ఈగుర్తింపు దక్కింది. టూరిజం అండ్ కల్చరల్ సెక్రటరీ వినయ్‌చంద్, టూరిజం అథారిటీ సీఈవో ఎం.అభిషిక్త్ కిషోర్ చేతుల మీదుగా మ్యాంగో రిసార్ట్ జనరల్ మేనేజర్ వై.శ్రీనివాసరావు అవార్డును అందుకున్నారు.

కాళంగి నుంచి ఇసుక అక్రమ రవాణా



పరమేశ్వరినగర్‌లో ఇసుక నిల్వలు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 30: కాళంగి నది నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా అక్రమార్కులు కాళంగి నది నుంచి పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నారు. పట్టణంలో పలుచోట్ల డంపింగ్ చేసుకొని శ్రీసిటీ సెజ్ ప్రాంతంలోని పరిశ్రమలకు, వెంచర్లకు తరలిస్తున్నారు. ముఖ్యమంగా ఇలుపూరు వద్ద కాళంగి నదిలో ఇసుక తవ్వకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. కాళంగి నది నుంచి జాతీయ రహదారి గుండా పదుల సంఖ్యలో ట్రాక్టర్లు ఇసుక తరలిస్తున్నా పోలీసు, రెవెన్యూ అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు.

స్విమ్స్‌లో పీజీ కోర్సులకు 2వ కౌన్సెలింగ్, స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 30: శ్రీవెంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ(స్విమ్స్) యూనివర్సిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంఎస్సీ(నర్సింగ్), ఎంఎస్సీ, ఎంహెచ్ఎస్, పీజీ డిప్లొమా కోర్సులకు అక్టోబరు 4న ఉదయం 8.30 గంటలకు 2వ విడత కౌన్సెలింగ్, స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ అపర్ణ సోమవారం తెలిపారు. ఎంఎస్సీ(నర్సింగ్)19, ఎంఎస్సీ క్లినికల్ వైరాలజీ 1, ఎంఎస్సీ కార్డియాక్ కాథెటరిజేషన్ ఇంటర్వెన్షన్ టెక్నాలజీ 1, ఎంఎస్సీ కార్డియో పల్మనరీ పర్ఫ్యూషన్ టెక్నాలజీ 2, పీజీ డిప్లొమా ఇన్ మెడికల్ రికార్డ్ సైన్సెస్ 7, పోస్ట్ బేసిక్ డిప్లొమా ఇన్ నర్సింగ్ ప్రోగ్రాంకు 23.. మొత్తం 53 సీట్లు అందుబాటులో ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. ఈ కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరై సీటు పొందిన వెంటనే నిర్ణిత ఫీజును చెల్లించాల్సి ఉంటుందని ఆమె తెలిపారు.

పూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు



వడమాలపేట, సెప్టెంబర్ 30: అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు పూర్ణాహుతితో సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం నిత్య కైంకర్యాల అనంతరం యాగశాల వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. అనంతరం మాడ వీధుల్లో ఉభయ దేవేరులతో స్వామివారి తిరువీధి ఉత్సవం జరిగింది. సాయంత్రం 6 గంటలకు ఆలయ ప్రధాన అర్చకుడు సూర్యకుమాచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగిసాయి.

ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామసభల విజయవంతం

ఏర్పేడు, సెప్టెంబరు 30: ప్రజల భాగస్వామ్యంతో గ్రామసభలను విజయవంతం చేయాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ చెప్పారు. మండలంలోని ఆమందూరు పంచాయతీలో జరుగుతున్న పెర్క్యులేషన్ పనులను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పండ్లు, పూల తోటల వివరాలను రైతులకు తెలిపి పెంపకం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు రూ.300 కూలీ పొందే విధంగా పని చేయాలన్నారు. పని ప్రదేశంలో మొబైల్‌యాప్‌లో అటెండెన్స్, పనుల ఫొటోలను అప్‌లోడ్ చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు.

వృద్ధ మహిళలకు చీరల పంపిణీ



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 30: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత ఆధ్వర్యంలో పట్టణంలోని అమ్మ ఆశ్రమంలో వృద్ధమహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం వారికి అల్పాహారం అందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతోమంది వృద్ధులకు ఆశ్రయం కల్పించి ఆదుకుంటున్న నిర్వాహకురాలు భూదేవిని అభినందించారు.

ముక్కంటి సేవలో కన్నడ నటి



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 30: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం కన్నడ నటి నిశ్వికనాయుడు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

సమయ పాలన పాటించని అధికారులు

● ప్రజల ఇక్కట్లు



అధికారులు లేకపోవడంతో వెనుదిగుతున్న ప్రజలు

వరదయ్యపాళెం, సెప్టెంబరు 30: తహసీల్దారు కార్యాలయంలో అధికారులు, సిబ్బంది సమయ పాలన పాటించడంలేదు. ప్రతి సోమవారం ప్రభుత్వం ప్రజల సమస్య పరిష్కారానికి గ్రీవెన్స్‌డే నిర్వహిస్తుండగా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం చర్చనీయాంశమైంది. కార్యాలయం చుట్టూ కాళ్ల అరిగేలా తిరుగుతున్నా తహసీల్దారు మాత్రం విజయవాడ కోర్టు అంటూ తమ సమస్యలు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపో తున్నారు. వన్‌బీ, అడంగల్ ఉండి పాసుపుస్తకం కోసం వెళితే సవాలక్ష ప్రశ్నలతో పాసుపుస్తకం ఇవ్వడం లేదని బాధితులంటున్నారు. ఆరు నెల లుగా ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాలు డీటీ అంటూ అందుబాటులో ఉండటం లేదని అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తహసీల్దారు కార్యాల య అధికారులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పాఠశాలలకు డస్ట్‌బిన్ల పంపిణీ



శ్రీసిటీ, సెప్టెంబరు 30: శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ ప్రచారంలో భాగంగా మాండలెజ్ పరిశ్రమ శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు సోమవారం లక్ష రూపాయల విలువైన డస్ట్‌బిన్లను పంపిణీ చేసింది. విద్యార్థులకు పరిశుభ్రతతో పాటు వ్యర్థాల నిర్వహణ ప్రాముఖ్యం పట్ల అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మాండలెజ్ హెచ్ఆర్ మేనేజర్ రవళి, శ్రీసిటీ సీఎస్ఆర్ మేనేజర్ నిరీష సన్నారెడ్డి తెలిపారు. ఇరుగుళం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం మొహిద్దీన్, మాండలెజ్ ప్రతినిధులు వెంకన్న, అమన్ పాల్గొన్నారు.

దళిత బహుజనుల సమస్యలను తీర్చండి

ఏర్పేడు, సెప్టెంబరు 30: దళిత బహుజనుల సమస్యలను తీర్చాలని అంబేడ్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంబేడ్కర్ స్టార్ కృష్ణ కోరారు. ఈ మేరకు సోమవారం తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి శాలువాతో సత్కరించి అంబేడ్కర్ చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ స్టార్ కృష్ణ మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టి న్యాయం చేయాలని కోరారు. వాసుదేవులు, చలపతి, ఈశ్వర్, బిట్టు తదితరులు పాల్గొన్నారు.

శాప్ చైర్మన్‌కు సన్మానం



శ్రీకాళహస్తి,సెప్టెంబరు 30: శాప్ చైర్మన్‌గా నియమితులైన రవి నాయుడును శ్రీకాళహస్తి టీడీపీ నాయకులు సోమవారం తిరుపతిలో మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో సత్కరించి ముక్కంటి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ... శ్రీకాళహస్తి నియోజకవర్గంలో క్రీడాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. టీడీపీ శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, నాయకులు ఎస్.సుధాకర్, జి.విజయనాయుడు, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుగంగ పైపులైనుకు మరమ్మతులు



రేణిగుంట, సెప్టెంబరు 30: పట్టణానికి నీరందిస్తున్న తెలుగుగంగ పైపులైను మరమ్మతులను యుద్ధప్రతిపాదికన చేపడుతున్నారు. రెండు నెలల క్రితం మంగళం వద్ద తెలుగుగంగ గేటువాల్వు, పైపులైన్ బ్లాక్ అవడంతో పట్టణానికి నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో స్థానిక టీడీపీ నాయకులు తాత్కాలికంగా బోర్లు వేయించి నీటి సరఫరా చేయిస్తున్నారు. ఈక్రమంలో తిరుపతి కార్పొరేషన్ అధికారులు చొరవ తీసుకుని వారం రోజులుగా తెలుగుగంగ పైపులైను మరమ్మతులు చేపడుతున్నారు. మరో మూడు రోజుల్లో పనులు పూర్తి కానున్నాయని, పట్టణవాసుల నీటి కొరత తీరనుంది.

రోడ్డుపై ఆగిన ఆర్టీసీ బస్సు

రేణిగుంట, సెప్టెంబరు 30: ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సు ఉన్నట్టుండి రోడ్డుపై ఆగిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. తిరుపతి - రేణిగుంట మార్గమధ్యంలో కృష్ణ తేజ విద్యాసంస్థల వద్ద గూడూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గూడూరు వెళ్తూ ఎక్స్‌లేటర్ పనిచేయకపోవడంతో రోడ్డు పక్కన నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. మరో బస్సులో వెళ్లారు.

రైల్వే స్టేషన్‌లో కొత్త నీటి పైపులైన్ల ఏర్పాటు



రేణిగుంట, సెప్టెంబరు 30: రైల్వేస్టేషన్‌లో కొత్తనీటి పైపులైన్ల ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. రేణిగుంట రైల్వేస్టేషన్ మీదుగా వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్ల కోచ్‌లకు నీటిని నింపేందుకు రైల్వేస్టేషన్ కేంద్రంగా ఉంది. అయితే పైపులైన్లు తుప్పు పట్టడంతో రైల్వేస్టేషన్‌లోని 5వ ప్లాట్‌ఫాంలో కొత్త ఇనుప పైపులైన్లను ఏర్పాటు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో కార్మికుడి మృతి



ఎల్లయ్య మృతదేహం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 30: అనుమానాస్పద స్థితిలో భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన పాపనపల్లిలో వెలుగు చూసింది. రూరల్ సీఐ రవినాయక్ తెలిపిన వివరాలు... పాపనపల్లికి చెందిన ఎల్లయ్య(37) భవన నిర్మాణ కార్మికుడు. ఆయన భార్య సుమలత ఉపాధి నిమిత్తం చెన్నైలో పనిచేస్తూ అక్కడే ఉంటోంది. ఆదివారం సాయంత్రం ఎల్లయ్య సమీపంలోని చెరువుకట్టపైకి బహిర్భూమి కోసం వెళ్లాడు. అక్కడే కళ్లు తిరిగి ముళ్లపొదలో పడిపోవడంతో ఆయన తండ్రి వెంకటయ్య కొడుకును ఇంటికి చేర్చాడు. సోమవారం అంత్యక్రియలకు విచ్చేసిన భార్య సుమలత భర్త మృతిపై అనుమానంతో రూరల్ పోలీసులను ఆశ్రయించింది. దాంతో సీఐ రవినాయక్ సిబ్బందితో పాపనపల్లికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తుచేపట్టారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 30: మండలంలో సమస్యల పరిష్కారానికి మండల స్థాయి అధికారులు చొరవ చూపాలని ఎంపీడీవో త్రివిక్రమ రావు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖధికారులతో ఆయన సమీక్షించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని, వర్ష కాలం మొదలు కావడంతో దోమలు చేరకుండా చూడాలన్నారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్నం భోజనం మెనూ ప్రకారం విద్యార్థులకు అందేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకంలో ప్రతి ఒక్కరికి పని కల్పించాలన్నారు.

రేపు వైద్య ఉచిత శిబిరం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 30: మాజీ మంత్రి బొజ్జల జ్ఞాపకార్థం ఈనెల 2న పట్టణంలోని గాంధీవీధి వినాయక ఆలయం వద్ద ఎంజీఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని ముక్కంటి పాలకమండలి మాజీ సభ్యుడు కానరం రమేష్ తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు జరిగే శిబిరం జరుగుతుందన్నారు.

కోటి ఉద్యోగాలు ఎక్కడ: పీడీఎస్‌యూ



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

శ్రీకాళహస్తి,సెప్టెంబరు 30: దేశంలో విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణ అవుతోందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ విమర్శించారు. అందుకు రాష్ట్రం కూడా ఎర్రతివాచి వేస్తోందని ధ్వజమెత్తారు. పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం పీడీఎస్‌యూ జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ... మోదీ అధికారంలోకి వస్తే ఏటా కోటి ఉద్యోగాలు ఇస్తామన్నారన్నారు. అయితే 11ఏళ్లు దాటినా 1,100 కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలను పక్కన పెట్టి తిరుపతి లడ్డూపై విద్వేషాలను రెచ్చగొడుతున్నాయన్నారు. అనంతరం పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడిగా జాకీర్, ఉపాధ్యక్షుడిగా నరేంద్ర, కార్యదర్శిగా లోకేష్, కోశాధికారిగా రిజ్వాన్‌ను ఎన్నుకున్నారు.

దాసుకుప్పం హైస్కూల్‌లో మరోమారు అధికారుల విచారణ



సమాధానాలు రాస్తున్న ఉపాధ్యాయులు

సత్యవేడు, సెప్టెంబరు 30: మండలంలోని దాసుకుప్పం జడ్పీ హైస్కూల్‌లో నెలకొన్న వివాదానికి సంబంధించి సోమవారం అధికారుల బృందం విచారణ జరిపారు. పాఠశాల పూర్వ హెచ్ఎం జ్యోతిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో డిప్యూటీ డీఈవో కృష్ణప్ప ఆధ్వర్యంలో పీలేరు ఎంఈవో లోకేశ్వర్, వడమాలపేట జడ్పీ హైస్కూల్ హెచ్ఎం కరుణ నవనీతం బృందం పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయులు, విద్యార్థులు, వంటకార్మికులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తుల నుంచి రాతపూర్వకంగా అభిప్రాయాలను సేకరించారు. హెచ్ఎం జ్యోతి ఈ ఏడాది ఫిబ్రవరి నెలకు సంబంధించిన వేతన బిల్లును బ్యాంకు ఖాతాలో జమ చేయకుండా తమపట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆ పాఠశాల ఉపాధ్యాయులు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఈవో శేఖర్ జూలై 26న పాఠశాలకు చేరుకుని విచారణ జరిపారు. నివేదికను ఆర్జేడీ అధికారులకు నివేదించారు. ఈ నేపథ్యంలో హెచ్ఎం జ్యోతిని ఆగస్టులో మండలంలోని రాజగోపాలపురం జడ్పీ హైస్కూల్‌కు బదిలీ చేశారు. అయితే జ్యోతి విధుల్లో చేరలేదు. మరోవైపు జ్యోతి కూడా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారులు త్రీమెన్ కమిటీతో విచారణ జరిపారు. ఈ క్రమంలో అధికారులు అందరికీ ప్రశ్నాపత్రాలు ఇచ్చి అందులో తాము పేర్కొన్న అంశాలకు రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలని కోరారు. కాగా హెచ్ఎం జ్యోతి వ్యవహారంపై ఇప్పటికి నాలుగు సార్లు విచారణ జరపడం గమనార్హం.

నీలాద్రి నిలయంలో మౌలిక వసతులు కల్పించండి



కలెక్టరేట్ వద్ద నీలాద్రి నిలయం వాసులు

ఏర్పేడు, సెప్టెంబరు 30: మండలంలోని వికృతమాల వద్ద గత టీడీపీ హయాంలో తిరుపతి అర్బన్ పరిధిలోని పేదలకు నీలాద్రి నిలయం పేరిట 1,800 ఇళ్లను కట్టారు. ప్రస్తుతం ఈ కాలనీలో 350మంది కుటుంబాలు నివసిస్తున్నాయి. అయితే మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో సోమవారం కాలనీవాసులు తిరుపతి కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతపత్రం సమర్పించారు. పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి రాత్రుల్లో ఇళ్లలోకి పాములు, తేళ్లు వస్తున్నాయని చెప్పారు. కొద్దిరోజుల క్రితం 8ఏళ్ల చిన్నారి రాత్రి సమయంలో పాము కాటు వేయడంతో మృతి చెందాడన్నారు. తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నామని, ప్రతి నెలా రేషన్ కూడా అందడం లేదని వాపోయారు. అనంతరం ఎస్పీ సుబ్బరాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. తమ కాలనీ వద్ద మందుబాబులు అల్లర్లు చేస్తున్నారన్నారు. అంతేకాకుండా కొంతమంది యువకులు గంజాయి మత్తులో ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్నారని తెలిపారు.

సహకార బ్యాంకులో విరివిగా రుణాలు



సమావేశంలో మాట్లాడుతున్న రవిబాబు

బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబరు 30: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులు, వ్యాపారులకు విరివిగా రుణాలను అందజేస్తున్నట్లు అసిస్టెంట్ రిజిస్ట్రార్, అఫిషియల్ ఇన్‌చార్జి రవిబాబు తెలిపారు. మండల కేంద్రంలోని కాటూరు సొసైటీ కార్యాలయంలో జరిగిన మహాజన సభలో ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరిగా కాకుండా సొసైటీలో పలు రకాల రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. రుణాలను తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించి వడ్డీ రాయితీని పొందాలన్నారు. 2024 మార్చి నుంచి ఆగస్టు 31వరకు జరిగిన లావాదేవీలు, జమా ఖర్చులను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో సీఈవో మహేష్ పాల్గొన్నారు.

చెత్త బుట్టల పంపిణీ



బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 30: మండలంలోని కారణి, నెరిణికండ్రిగ, కంచనపుత్తూరు, బీఎన్‌కండ్రిగ పంచాయతీల్లో కార్యదర్శి ఇందిరమ్మ ఆధ్వర్యంలో సోమవారం చెత్త బుట్టలను సర్పంచులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... స్వచ్ఛతా హీ సేవలో భాగంగా గ్రామాల్లో చెత్తనుంచి సంపద కేంద్రాలను తిరిగి ప్రారంభించామన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరు చేసి కేంద్రాలకు తరలించాలన్నారు. సర్పంచులు స్వప్న, పద్మమ్మ, వెంకటమ్మ, చంద్రయ్య, ఉపసర్పంచ్ మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

ఆదిమూలంపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

కేవీబీపురం, సెప్టెంబరు 30: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కేవీబీపురంలో సత్యవేడు తెలుగుయువత అధ్యక్షుడు లక్ష్మీపతిరాజు ఆధ్వర్యంలో టీడీపీ అధిష్ఠానాన్ని కోరారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడుతోందని దీన్ని దృష్టిలో పెట్టుకుని సస్పెన్షన్ వేటు ఎత్తివేయాలని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ను కోరారు. తెలుగు యువత నాయకులు బాలాజీ, సురేష్‌రెడ్డి, వెంకటముని, మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

ఏర్పేడు, సెప్టెంబరు 30: మండలంలోని పల్లం జడ్పీ ఉన్నత పాఠశాలను డీవైఈవో బాలాజి సోమ వారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థులు చదువులో పురోగమించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయుడు కిట్టన్న ప్రచురించిన బాల కళానిధి పుస్తకాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ వెంకటరమణ, వేణుగోపాల్‌రెడ్డి, మదన్‌మోహన్, భాగ్యశేఖర్‌రెడ్డి, కిట్టన్న తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రదోష పూజలు



నాగలాపురం, సెప్టెంబరు 30: మండలంలోని సురుటుపల్లెలో కొలువై ఉన్న పళ్లికొండేశ్వరాల యంలో సోమవారం ప్రదోష పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం ఆల యంలోని పరివార దేవతలకు ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుకుల్ నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం ఆలయ ప్రదోష మండపంలోని నందీశ్వరుడికి పంచామృతాలతో అభిషేకాలు చేసి నక్షత్ర హారతి, కుంభ హారతి చేపట్టారు. ఈ పూజా కార్యక్రమాలను ఈవో లత పర్యవేక్షించారు.

అధికారులూ... వైసీపీ మత్తు వీడండి: టీడీపీ

నాగలాపురం, సెప్టెంబరు 30: ప్రభుత్వ అధికారులు వైసీపీ మత్తు వీడాలని టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్ అన్నారు. గత శనివారం మండలంలోని సురుటుపల్లెలో జరిగిన గ్రామసభకు సంబంధించి తప్పుడు దండోరా అన్న కథనంపై మండల ప్రధాన కార్యదర్శి పార్తిబన్ సహా స్థానిక నాయకులతో కలిసి సురుటుపల్లె సచివాలయం వద్ద సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ... వైసీపీ నేతలతో కుమ్మక్కై ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావద్దని అధికారులకు హితవు పలికారు. ప్రభుత్వ కార్యక్రమా లకు సంబంధించి గ్రామస్తులకు, నాయకులకు సరైన సమాచారం ఇవ్వాల న్నారు. రుద్రయ్య, మురళి, మనోజ్, హరి, యమునమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం వితరణ

వరదయ్యపాళెం, సెప్టెంబరు 30: పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో కళాశాల విద్యార్థులకు దాత ఆణిముత్యం నందకిషోర్‌రెడ్డి రూ.30వేలు విలువైన యూనిఫాం వితరణ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. హెచ్ఎం రమణయ్య పాల్గొన్నారు.

మహిళా ప్రాముఖ్యంపై అవగాహన

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 30: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో సోమవారం మహిళ సాధికార విభాగం ఆధ్వర్యంలో మహిళ ప్రాముఖ్యతపై ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.శ్రీలత మాట్లాడుతూ... విద్యార్థినులు కళాశాలలో, సమాజంలో ఎలా ప్రవర్తించాలో వివరించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన కమిటీల గురించి వివరించారు. సమస్యలపై యువతులు ఎలా ఫిర్యాదు చేయాలో అవగాహన కల్పించారు. అధ్యాపకులు సునీత, సుభాషిణి, రుద్రమదేవి, సంక్రాంతి రాజేంద్రుడు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై ర్యాలీ

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 30: రోడ్డు భద్రతపై పోలీసులు, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు బీఎన్‌కండ్రిగ పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ విశ్వనాథ నాయుడు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ తప్పని సరిగా లైసెన్సు తీసుకుని వాహనాలు నడపాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు మాత్రమే వాహనం నడపాలని, మద్యం తాగి వాహనాలు నడపడం నేరమన్నారు.

చైన్ స్నాచర్ అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

పిచ్చాటూరు, సెప్టెంబరు 30: పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లో ఈ ఏడాది జూలైలో చైన్ స్నాచింగ్ చేసిన సూర్యను సోమవారం విజయపురం మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్ వద్ద పిచ్చాటూరు ఎస్ఐ వెంకటేశ్వరులు అరెస్టు చేశారు. ఎస్ఐ తెలిపిన వివరాలు... జూలై 14న సాయంత్రం 6 గంటల ప్రాంతంలో అప్పలరాజుకండ్రిగకు చెందిన శకుంతలమ్మ ఇంటి ముందు ఫోన్ చూసుకుంటూ ఉండగా సూర్య ఇంకో వ్యక్తితో కలిసి ఆమె మెడలో ఉన్న 32 గ్రాముల బంగారు చైన్‌ను లాక్కొని బైక్‌లో పరారయ్యాడు. అదే నెల 24వ తేదీ నాగలాపురం మండలంలోని వడ్డిపాళెం వద్ద పశువులు మేపుతున్న చెంచమ్మ వద్దకు వచ్చి అడ్రస్ అడిగినట్లు అడిగి మెడలోని 10 గ్రామల బంగారు చైన్ లాక్కెళ్లారు. కాగా సూర్య(23)ది తమిళనాడులోని తిరుత్తణి తాలూకా కాశీనాథపురం. ఎస్ఐ వెంకటేశ్వరులును పుత్తూరు డీఎస్పీ రవికుమార్, నారాయణవనం సీఐ భాస్కర్ నాయక్ అభినందించారు.

ఈ బైక్ ఎవరిది?



పిచ్చాటూరు, సెప్టెంబరు 30: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వీధిలో శరవణ కాంప్లెక్స్ సమీపంలో నాలుగు రోజులుగా ఓ బైక్ పార్కింగ్ చేసి ఉంది. నెం. టీఎన్ 20సీఆర్ 7088 , హీరో ప్యాషన్ బైక్ యజమాని ఏమయ్యాడో అని కాలనీవాసులు అంటున్నారు.

ఉదయం 10గంటల్లోగా పింఛన్ల పంపిణీ పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్


శ్రీకాళహస్తి, సెప్టెంబరు 30: పురపాలక సంఘ పరిధిలో మంగళవారం ఉదయం 10 గంటల్లోపు పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని కమిషనర్ బీఎస్ గిరి కుమార్ ఆదేశించారు. పురపాలక సంఘ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో ఆయన సమీక్షించారు. పింఛన్ల పంపిణీని ఉదయం 6 గంటల నుంచి ప్రారంభించి 10 గంటల్లోపు వందశాతం పూర్తి చేయాల న్నారు. లబ్ధిదారులు కూడా ఇళ్ల వద్దనే ఉండి తమ పింఛన్లను తీసుకోవాలని ఆయన సూచించారు.

మృత్యుంజయుడికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 30: శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయ స్వామికి సోమవార పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా వినాయకస్వామికి అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయుడికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంలో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

చక్రేశ్వరస్వామికి విశేష పూజలు



శ్రీకాళహస్తి,సెప్టెంబరు 30: శ్రీకాళ హస్తీశ్వరాలయానికి అనుబంధ ఆల యమైన ముత్యాలమ్మ గుడి వీధిలో కొలువైఉన్న చక్రేశ్వరస్వామికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. తీర్థప్రసాద వినియోగం జరిగింది.

వైభవంగా ప్రదోష నందిసేవ



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 30: శ్రీకాళహస్తీశ్వ రాలయంలో సోమవారం సాయంత్రం దీపారాధన అనంతరం త్రయోదశి సందర్భంగా స్వామి అమ్మవార్లకు వైభవంగా ప్రదోష నందిసేవ నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు విశేష పూజలు చేసి ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

6నుంచి విద్యా, వైజ్ఞానిక సభలు: ఏపీటీఎఫ్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 30: ఏపీటీఎఫ్ 80 సంవత్సరాల వేడుకలు, 20వ విద్య, వైజ్ఞానిక మహాసభలు ఈనెల 6, 7, 8 తేదీల్లో విజయనగరంలో జరుగుతాయని సంఘ నాయకులు తెలిపారు. శ్రీకాళహస్తి మండలం ఎగువీధి జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఫెడరేషన్ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.దేవానంద్, రూరల్ అధ్యక్షురాలు సరిత తదితరులు పాల్గొన్నారు.

7నుంచి గుడిమల్లంకు ఏపీ టూరిజం బస్సులు



ఆలయం వద్ద ఏపీ టూరిజం అధికారులు

ఏర్పేడు, సెప్టెంబరు 30: భారతదేశంలో మొదటి శివాలయంగా గుర్తింపు పొందిన ఏర్పేడు మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయానికి తిరుపతి శ్రీనివాసం నుంచి అక్టోబరు 7వ తేదీ నుంచి ఏపీ టూరిజం బస్సులు నడుపుతున్నట్టు ఏపీ పర్యాటకాభివృద్ధి కార్పొరేషన్ డివిజన్ మేనేజరు గిరిధర్ తెలిపారు. గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయాన్ని ఏపీ టూరిజం అధికారులు సోమవారం సందర్శించారు. ఆలయ అర్చకులు పవన్‌శర్మ, వంశీకృష్ణశర్మ వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. నెల రోజుల క్రితం ఆలయ మాజీ చైర్మన్ బి.గిరినాయుడు ఏపీ టూరిజం అధిఆకరులకు గుడిమల్లం ఆలయానికి బస్సులు నడపాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన అధికారులు అక్టోబరు 7 నుంచి తిరుపతి శ్రీనివాసం నుంచి గుడిమల్లం ఆలయం వరకు బస్సులు నడుపుతున్నట్టు ప్రకటించారు. గిరినాయుడు, రాజశేఖర్‌నాయుడు, పద్మనాభం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వెలుగు ఏపీఎంగా డాంగే యాదవ్

సత్యవేడు, సెప్టెంబరు 30: సత్యవేడు వెలుగు ఏపీఎంగా డాంగే యాదవ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏపీఎంగా విధులు నిర్వహించిన స్వర్ణలత చిన్నగొట్టిగల్లు మండలానికి బదిలీ అయ్యారు. దీంతో తిరుపతి డీఆర్‌డీఏ కార్యాలయంలో పని చేస్తున్న డాంగే యాదవ్‌ను ఇక్కడికి బదిలీ చేశారు.